www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 9014966169

Published from: Hyderabad, Rangareddy, Karimnagar, Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 39 | శుక్రవారం | 11 సెప్టెంబర్, 2026

# కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రజలకు వివరించాలి
- సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ కుట్ర చేసింది
- అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు పూర్తి స్థాయిలో పాల్గొనాలి
- ఓటు హక్కు పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలి
- సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



**ప్రజానావ, హైదరాబాద్:** ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు సభ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ సజావుగా సాగకుండా అడ్డుకునేందుకు కుట్ర చేసిందని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం అధ్యక్షతన జరిగిన సీఎల్పీ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులకు ఆయన దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో పాల్గొన్నారు.

### సభ్యులకు సీఎం అభినందనలు

అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు అహంకారం వీడలేదని రేవంత్‌రెడ్డి విమర్శించారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజులపాటు సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగించారని ఆరోపించారు. అధికారుల పట్ల అనుచితంగా వ్యవహరించడంతో పాటు మహిళా అధికారుల ఎదుట టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించారని, శాసనసభాపతిని అభ్యంతరకరంగా దూషించారని మండిపడ్డారు. ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించిన సందర్భంలో దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారని గుర్తు చేశారు. ప్రతిపక్షం చేసిన కుట్రను సమర్థంగా తిప్పికొట్టి, ప్రభుత్వంపై జరిగిన ప్రచారాన్ని ప్రజలకు వివరించినందుకు పార్టీ సభ్యులను సీఎం అభినందించారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రతి సభ్యుడు తప్పనిసరిగా చర్చల్లో పాల్గొనాలని, హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలని సూచించారు. ప్రజలు ఇచ్చిన పదవులు, బాధ్యతలను సక్రమంగా వినియోగించుకోవాలని అన్నారు. వ్యక్తిగత పనితీరు, సభలో వ్యవహరించే తీరు భవిష్యత్తులో రాజకీయంగా కీలక ప్రభావం చూపుతాయని ఎమ్మెల్యేలకు సూచించారు.

### 'సర్‌పై అప్రమత్తంగా ఉండాలి'

ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర జరుగుతోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యేగా మరోసారి గెలవాలనుకునే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని తీవ్రంగా పరిగణించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో అవకతవకలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణలో చేపట్టిన కులగణన దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ నమూనాను అనుసరించి దేశవ్యాప్తంగా జనగణనలో కులగణన చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు.

### కాంగ్రెస్‌కు నష్టం చేసే ప్రయత్నాలు వద్దు

అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో సమర్థంగా ప్రస్తావించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయంగా ఎదిగి.. అదే పార్టీకి నష్టం కలిగించేలా కొందరు వ్యవహరిస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అవకాశం కల్పించకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నాయకులు రాష్ట్రస్థాయిలో ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీసు సిబ్బందిలోనూ కేటీఆర్ కనిపించినట్లుగా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించారని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆగ్రహంతో అధికారులపై దాడులకు పాల్పడటం తరువాయి 2లో

## ఉద్యోగులకు గుడ్ న్యూస్



- సమస్యలపై సీఎం సానుకూల స్పందన
- ఆరు డీఏలపై త్వరలో ప్రకటన
- పీఆర్సీ నివేదికను వెంటనే అందేలా చర్యలు
- ఒక్కో సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం
- ఉద్యోగ సంఘాల జేఏసీకి రేవంత్‌రెడ్డి హామీ

**ప్రజానావ, హైదరాబాద్:** ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ ఆహ్వానం మేరకు జేఏసీ నేతలు సీఎంను కలిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బందిపై పెరుగుతున్న పని ఒత్తిడి, ఆర్థిక ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పీఆర్సీ తరువాయి 2లో



# అంతరిక్షంలో భారత్ జోరు

## చంద్రయాన్-3 నుంచి ఆదిత్య-ఎల్1 వరకు విజయాలు

- తరతరాల శాస్త్రవేత్తల కృషితోనే ప్రపంచ గుర్తింపు
- తక్కువ వ్యయంతో అత్యుత్తమ ప్రయోగాలు
- 2035లో అంతరిక్ష కేంద్రం.. 2040లో చంద్రుడిపై భారతీయుడు
- తొలి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సులో ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సాధిస్తున్న విజయాలు, ప్రపంచవ్యాప్తంగా దానికి లభిస్తున్న గుర్తింపు వెనుక తరతరాలుగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు చేసిన కఠోర శ్రమ ఉందని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. భారత అంతరిక్ష ప్రయాణంలో ఇస్రో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. పారిస్‌లో గురువారం జరిగిన తొలి అంతర్జాతీయ అంతరిక్ష సదస్సును ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. తక్కువ వ్యయంతో అత్యుత్తమ అంతరిక్ష ప్రయోగా లను నిర్వహిస్తూ ఇస్రో ప్రపంచ ప్రశంసలు అందుకుంటోందని మోదీ అన్నారు. అంతరిక్ష సాంకేతికతలు రైతులు, మత్స్యకారులకు ఉపయోగ పడట ంతోపాటు వాతావరణ అంచనాలు, విపత్తుల నిర్వహణ, నావిగేషన్ వంటి కీలక రంగాలకు సేవలందిస్తున్నాయని తెలిపారు. భారత రాకెట్ల ద్వారా ఇప్పటివరకు 34 దేశాలకు చెందిన 430కు పైగా ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపినట్లు వెల్లడించారు. చంద్రయాన్–3 విజయాన్ని ప్రస్తావిస్తూ.. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించిందని ప్రధాని గుర్తుచేశారు. సూర్యుడి రహస్యాలను అధ్యయనం తరువాయి 2లో

## అబూ సలేంకు సుప్రీంలో చుక్కెదురు 2

- 25ఏళ్ల జైలు శిక్ష పూర్తయిందంటూ విడుదల కోరిన పిటిషన్ కొట్టివేత
- పోర్చుగల్‌కు ఇచ్చిన హామీతో జీవిత ఖైదు 25 ఏళ్ల శిక్షగా మారదు
- ఒకే కాలాన్ని రెండుసార్లు లెక్కించలేం: అత్యున్నత ధర్మాసనం

## కేటీఆర్, హరీశ్‌రావుపై కేసు

- మహిళా పోలీసులతో దురుసు ప్రవర్తన
- నలుగురు బీఆర్ఎస్ నేతలపై సైఫాబాద్ పోలీసుల ఎఫ్ఐఆర్ 2
- దర్యాప్తు చేపట్టిన పోలీస్ అధికారులు

## కమిటీ పునర్వ్యవస్థీకరణకు నో

- మా చేతిని మేం అనుమానించం.. కమిటీపై పక్షపాత ముద్ర వద్దు 2
- లోపాలుంటే చెప్పండి.. బహిరంగ విచారణ చేపడతాం: సుప్రీంకోర్టు
- ప్రజల నుంచి అభిప్రాయాలు, ఆధారాలు స్వీకరించేందుకు బహిరంగ ప్రకటన
- కమిటీ సభ్యుడిపై అభ్యంతరాలను పరిశీలిస్తామన్న ధర్మాసనం
- విద్యార్థికి నోటీసిచ్చిన అధికారి సస్పెన్షన్
- సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా



## పంచాయతీల ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే!

- పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం 2
- ట్రెజరీ నుంచి నిధుల డ్రా ప్రక్రియకు స్వస్తి.. గ్రామ అవసరాలకు నిధుల వినియోగం సులభం
- కేంద్రం నుంచి రూ.619 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉంది
- పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నాం
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క




## ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

- దోపిడీని ప్రశ్నిస్తామనే బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్!
- రూ.200 కోట్ల భూమిని సీఎం సోదరుడి కంపెనీకి ఎలా ఇచ్చారు?
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో రేవంత్ కుటుంబమే బాగుపడింది
- ఫ్యూచర్ సిటీపై రంగారెడ్డి జిల్లాలో సదస్సులు.. న్యాయపోరాటం
- సస్పెన్షన్ ఎత్తివేస్తే వెంటనే అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొంటాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంటు కోతలు

- కేసీఆర్ హయాంలోని 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఎక్కడ?
- బీఆర్ఎస్ కార్యానిర్వహణ అధ్యక్షుడు కేటీఆర్
- సీఎం సొంత గ్రామంలోనే రైతుల కష్టాలు.. ఎక్స్‌లో వీడియో

## రిజర్వాయర్లపై ఫ్లోటింగ్ సోలార్!

- నాగార్జునసాగర్, శ్రీశైలం సహా ప్రధాన జలాశయాలపై పరిశీలన 2
- ఒక్క మెగావాట్‌పై రూ.1.30 కోట్ల అదనపు భారం
- విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరింది
- అశ్వారావుపేటలో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





## బ్రిక్స్ సదస్సుకు ఢిల్లీ ముస్తాబు

- పుతిన్, జిన్‌పింగ్, పెజెష్కియాన్ రాక 6
- 7 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు



## ఫిలిప్పీన్స్‌లో ఘోర ఫెర్రీ ప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న ప్యాసింజర్ ఫెర్రీ 6
- ఐదుగురు మృతి, 87 మంది గల్లంతు



## జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారు!

- బ్రిక్స్ సదస్సుకు హాజరుకానున్న చైనా అధ్యక్షుడు 2
- రేపు, ఎల్లుండి ఢిల్లీలో బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాలు
- జిన్‌పింగ్ రాకపై తొలగిన సస్పెన్స్.. అధికారికంగా వెల్లడించిన చైనా
- మోదీ,జిన్‌పింగ్ భేటీకి అవకాశం.. ద్వైపాక్షిక అంశాలపై చర్చకు ఛాన్స్

## సీఎంతో భేటీకి రాజకీయ రంగు పులమొద్దు!

- అభివృద్ధి, నిధుల కోసం సీఎం, డిప్యూటీ సీఎంను కలవడం తప్పా? 2
- రేవంత్‌తో అభిప్రాయ భేదాలు సహజమే.. పదవి కోసం లొంగిపోయాననడం అవాస్తవం
- మంత్రి పదవుల విస్తరణపై నిర్ణయం అధిష్టానానిదే: మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



## తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

- ప్రజా సమస్యలపై వెంటనే స్పందించే మంత్రి.. గతంలో ఇలాంటి వారిని చూడలేదు'
- పార్టీలు వేరైనా మంచి పనిని మెచ్చుకోవడంలో తప్పులేదు: పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి 2
- సమస్య పరిష్కారం వరకు అధికారులతో మాట్లాడటం తుమ్మల ప్రత్యేకత అని వెల్లడి

## లక్ష్మీనారాయణ చెరువును కాపాడండి! 2

- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు స్థానికులు, మత్స్యకారుల విజ్ఞప్తి
- 600 ఎకరాలకుపైగా విస్తీర్ణం.. కాలుష్యంతో చేపలు మృత్యువాత
- జవహర్‌నగర్ డంపుయార్డు వ్యర్థాలే ప్రధాన కారణమని ఆరోపణ

# ఉద్యోగులకు గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా వివరించారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి అంశాన్ని ఆయనకు తెలియజేశారు.

### 'ఉద్యోగుల పక్షానే ఉంటా'

ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘంగా చర్చించినట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (టీఆర్ఈఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్‌రెడ్డి తెలిపారు. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు వారు వెల్లడించారు. పీఆర్సీ కమిటీ నివేదికను కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం చెప్పినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

### టీఆర్ఈఎస్ఏ హర్షం

ఉద్యోగుల సమస్యలపై సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్ఈఎస్ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని సంఘం నేతలు తెలిపారు.సీఎంను కలిసిన వారిలో టీఆర్ఈఎస్ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

(మొదటి పేజీ తరువాయి)

సరికాదన్నారు. ప్రతి ఎమ్మెల్యే పనితీరు, ప్రవర్తనను ప్రజలు గమనిస్తున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరి వ్యక్తిగత పనితీరు వచ్చే ఎన్నికల్లో గెలుపోటములపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సీఎల్పీ సభ్యులకు సూచించారు.

# అబూ సలేంకు సుప్రీంలో చుక్కెదురు

**న్యూఢిల్లీ:** ముంబయి 1993 వరుస బాంబు పేలుళ్ల కేసులో దోషి, గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. భారత్‌లో 25 ఏళ్ల జైలు శిక్ష పూర్తయిందని, తనను విడుదల చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం బాంబే హైకోర్టు తీర్పును సమర్థించింది. పోర్చుగల్ నుంచి 2005 నవంబర్ 11న సలేంను భారత్‌కు అప్పగించారు. అప్పగింత సమయంలో భారత్–పోర్చుగల్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం సలేంకు మరణశిక్ష విధించకూడదు. 25 ఏళ్లకు మించి జైలులో ఉంచకూడదని భారత ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఈ హామీతో సలేంకు విధించిన జీవిత ఖైదు 25 ఏళ్ల కాలపరిమితి శిక్షగా మారదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 2022 జూలై 11న ఇచ్చిన తీర్పులో సలేం శిక్షా కాలాన్ని లెక్కించేందుకు 2005 అక్టోబర్ 12ను ప్రారంభ తేదీగా నిర్ణయించిన విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. రెండు వేర్వేరు కేసుల్లో విధించిన జీవిత ఖైదు శిక్షలు ఏకకాలంలో అమలు కావాలని ఆదేశించినందున, ఒకే కాలం జైలు శిక్షను రెండుసార్లు లెక్కించలేమని పేర్కొంది. అలా లెక్కించడం చట్టపరమైన ఆధారం లేని విధంగా జైలు కాలాన్ని కృత్రిమంగా పెంచడమేనని వ్యాఖ్యానించింది.

### పోర్చుగల్‌కు ఇచ్చిన హామీపై..

సలేంను మరణశిక్షకు గురిచేయబోమని, 25 ఏళ్లకు మించి జైలులో ఉంచబోమని పోర్చుగల్‌కు భారత్ ఇచ్చిన హామీని 2022 తీర్పులోనే సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుందని ధర్మాసనం తెలిపింది. అయితే ఆ హామీ ఆధారంగా జైలు శిక్షను కృత్రిమంగా లేదా వేగవంతంగా లెక్కించి విడుదల కోరే హక్కు సలేంకు లేదని స్పష్టం చేసింది. 1993 ముంబయి వరుస పేలుళ్ల వంటి దేశ ఆర్థిక, భద్రతా వ్యవస్థను దెబ్బతీసే తీవ్ర నేరాల విషయంలో వాటి ప్రభావాన్ని విస్మరించలేమని ధర్మాసనం పేర్కొంది. బాంబే హైకోర్టు తీర్పులో ఎలాంటి లోపం లేదని తేల్చి, సలేం అప్పీల్‌ను కొట్టివేసింది.

# కేటీఆర్, హరీశ్‌రావుపై కేసు

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణ అసెంబ్లీ వద్ద విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు సహా నలుగురు బీఆర్ఎస్ నేతలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గేట్ నంబర్–3 వద్ద మహిళా కానిస్టేబుళ్లు భద్రతా విధుల్లో ఉన్నారు. అదే సమయంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా పలువురు బీఆర్ఎస్ నేతలు రాజకీయ నినాదాలతో కూడిన నల్ల టీ–షర్టులు ధరించి, ప్లకార్డులతో అక్కడికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనల ప్రకారం వాటికి అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో బీఆర్ఎస్ నేతలు తమను దుర్భాషలాడారని మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదులో పేర్కొన్నారు. కేటీఆర్, హరీశ్‌రావు తమను అవమానకర రీతిలో దూషించారని మహిళా కానిస్టేబుల్ ఆరోపించారు. హరీశ్‌రావు తన టీ–షర్టును విప్పి పోలీసు అధికారిపైకి విసిరి, మహిళా సిబ్బంది సమక్షంలో అసభ్యకరంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కూడా తమతో దురుసుగా వ్యవహరించి ఇబ్బందులకు గురిచేశారని ఆమె ఆరోపించారు.

### కేసు నమోదు.. దర్యాప్తు

మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు లైంగిక వేధింపులు, దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం తదితర ఆరోపణలకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# లక్ష్మీనారాయణ రువును కాపాడండి!

**ప్రజానావ,హైదరాబాద్:** ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలోని చారిత్రక లక్ష్మీ నారాయణ చెరువును పరిరక్షించి అభివృద్ధి చేయాలని స్థానికులు, మత్స్యకారులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం రంగనాథ్ ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త, హైడ్రా అదనపు కమిషనర్ డి. ఆనంద్‌కుమార్‌తో కలిసి చెరువును సందర్శించారు. గణేశ్ నిమజ్జనానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హైడ్రా కమిషనర్‌ను కలిసి చెరువు చరిత్రను వివరించారు. గతంలో 600 ఎకరాలకు పైగా విస్తరించి తాగు, సాగునీటి అవసరాలను తీర్చిన ఈ చెరువు ప్రస్తుతం తీవ్ర కాలుష్యానికి గురైందని తెలిపారు. చెరువు నీటిని తాకితే చేతులకు జిగురులా అంటుకునే స్థాయిలో కాలుష్యం ఉందని, దీంతో చేపలు మృత్యువాత పడుతున్నాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు.జవహర్‌నగర్ డంప్‌యార్డు నుంచి వచ్చే వ్యర్థాలు, మురుగునీరు చెరువులో కలవడం వల్లే పరిస్థితి దారుణంగా మారిందని స్థానికులు ఆరోపించారు. జవహర్‌నగర్ నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా నాలాను మళ్లిస్తే సమస్య చాలావరకు పరిష్కారమవుతుందని సూచించారు.

### 'చెరువును అభివృద్ధి చేయాలి'

నగరంలోని పలు చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడంతో పరిసరాల రూపురేఖలు మారుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. అదే తరహాలో ఏదులాబాద్ లక్ష్మీ నారాయణ చెరువును కూడా పునరుద్ధరించి అభివృద్ధి చేయాలని కోరారు.చెరువు చుట్టుపక్కల బోర్లలో కలుషిత నీరు వస్తోందని, దీంతో ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న చెరువును పరిరక్షించేందుకు త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హామీ ఇచ్చారు.

# ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

**ప్రజానావ, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్ణయాలు, భూకేటాయింపులపై ప్రశ్నిస్తున్నందుకే బీఆర్ఎస్ సభ్యులను శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ముఖ్యమంత్రి కుటుంబం మాత్రమే లబ్ధి పొందిందని విమర్శించారు. సుమారు రూ.200 కోట్ల విలువైన భూమిని సీఎం సోదరుడికి చెందిన కంపెనీకి ఎలా కేటాయించారని ప్రశ్నించారు. ఈ అంశంపై తాము ప్రశ్నిస్తే విషయాలు బయటపడతాయనే ఉద్దేశంతోనే అసెంబ్లీ నుంచి బయటకు పంపారని ఆరోపించారు.

అనుముల సోదరులపై తాము చేస్తున్న ఆరోపణల విషయంలో భాజపా ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో కంపెనీ ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ''దోచుకున్నది అంతరిక్షంలో దాచుకునేందుకే ప్రయత్నిస్తున్నట్లుంది'' అంటూ విమర్శించారు.ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలు బలిపశువులు కావొద్దని కేటీఆర్ సూచించారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు రంగారెడ్డి జిల్లాలోని గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

### 'అన్ని మార్గాల్లో పోరాటం'

ఫ్యూచర్ సిటీ, భూకేటాయింపుల అంశాలపై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని కేటీఆర్ వెల్లడించారు. అన్ని ప్రజాస్వామ్య, న్యాయపరమైన మార్గాల్లో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ఈ వ్యవహారంపై ఈడీ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా భూములను పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామని




అన్నారు. తమపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తే నేరుగా అసెంబ్లీకి వచ్చి చర్చల్లో పాల్గొంటామని స్పష్టం చేశారు.

### 'ఫేక్ ఖాతాపై పోలీసులకు ఫిర్యాదు'

సీఎం టీమ్ పేరుతో ఉన్న ఫేక్ ఖాతాను అసెంబ్లీలో ప్రస్తావించి సభను తప్పుదోవ పట్టించారని కేటీఆర్ ఆరోపించారు. ఆ ఫేక్ ఖాతాపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు కూడా ఇస్తామని వెల్లడించారు. ప్రజా సమస్యలను లేవనెత్తుతున్న ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయడం ద్వారా ప్రభుత్వం ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటోందని కేటీఆర్ విమర్శించారు.

## కాంగ్రెస్ పాలనలో మళ్లీ కరెంటు కోతలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో విద్యుత్ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అందించిన 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ స్థానంలో రాష్ట్రంలో మళ్లీ కరెంటు కోతలు మొదలయ్యాయని విమర్శించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లికి చెందిన రైతులు విద్యుత్ సమస్యలపై తమ ఆవేదన వ్యక్తం చేస్తున్న వీడియోను కేటీఆర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పంచుకున్నారు. ''కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రానికి వచ్చిన అసలైన మార్పు ఇదేనా?'' అని కేటీఆర్ తన పోస్టులో ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి పాలమూరు జిల్లాలో, ఆయన సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనే రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సరిపడా వోల్టేజ్ లేకపోవడంతో పాటు సమయానికి విద్యుత్ సరఫరా కాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. పొలాలకు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, తక్కువ వోల్టేజీ కారణంగా విద్యుత్ మోటార్లు కాలిపోతున్నాయని తెలిపారు. రైతులకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమవుతోందని కేటీఆర్ విమర్శించారు.



# అంతరిక్షంలో భారత్ జోరు

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు చేపట్టిన ఆదిత్య–ఎల్1 మిషన్ కీలక పరిశోధనలు కొనసాగిస్తోందన్నారు. గత ఏడాది ఓ భారతీయుడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.

### ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం

2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయడం, 2040లో భారతీయుడిని చంద్రుడిపైకి పంపడం తమ లక్ష్యాలని మోదీ వెల్లడించారు. అంతరిక్ష రంగంలో భారత్ చేపట్టే ప్రతి ప్రయత్నం ద్వారా లభించే ప్రయోజనాలు యావత్ మానవాళికి చేరేలా చూడడమే తమ మార్గదర్శక సూత్రమని స్పష్టం చేశారు. ఇస్రోతో పాటు దేశంలోని ప్రైవేటు అంతరిక్ష రంగం కూడా వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని తెలిపారు. ప్రైవేటు సంస్థల ఔత్సాహికత, ఇస్రో సాంకేతిక నైపుణ్యం కలిసి భారత అంతరిక్ష రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు.

# రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్'!

**ప్రజానావ, హైదరాబాద్:** తెలంగాణలో పునరుత్పాదక ఇంధన రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలను సిద్ధం చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లపై తేలియాడే సౌర విద్యుత్ కేంద్రాలు (ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్లు) ఏర్పాటు చేసే అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

### ప్రధాన జలాశయాలపై పరిశీలన

నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయా? అనే అంశంపై నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా పరిశీలిస్తున్నాయని భట్టి తెలిపారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకోవడంతో పాటు పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని పెంచే దిశగా ఈ ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయని పేర్కొన్నారు. అయితే ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, సుంకాల కారణంగా ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ.1.30 కోట్ల అదనపు భారం పడుతోందని వివరించారు. ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రంలో సోలార్ రంగానికి భారీగా పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.

### 19 వేల మెగావాట్లకు విద్యుత్ డిమాండ్

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయ రంగం విస్తరణతో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగిందని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు



చేరిందన్నారు. పేదలు, రైతులకు అందిస్తున్న విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ.19 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వెల్లడించారు.

### 80 గ్రామాలకు సౌర విద్యుత్

గిరిజన ప్రాంతాల్లో సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి తెలిపారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్టును చేపట్టినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో స్వతంత్ర మైక్రో గ్రిడ్లను ఏర్పాటు చేసే అంశంపై కసరత్తు జరుగుతోందన్నారు.ఇళ్లపై, వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేలా రైతులు, ప్రజల్లో అవగాహన కల్పించాలని భట్టి విక్రమార్క సూచించారు. భవిష్యత్తులో విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచేందుకు సోలార్ విద్యుత్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.

# కమిటీ పునర్వ్యవస్థీకరణకు నో

**న్యూఢిల్లీ:** నీట్ నిరసనల సందర్భంగా విద్యార్థులపై పోలీసులు అధిక బలప్రయోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలు, పోలీసులపై నిరసనకారుల హింసాత్మక చర్యలపై విచారణకు ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల ఉన్నతస్థాయి కమిటీని పునర్వ్యవస్థీకరించేందుకు తాము అంగీకరించబోమని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆర్. సుభాష్‌రెడ్డి నేతృత్వంలోని ఈ కమిటీ పక్షపాతంతో వ్యవహరిస్తుందనే ముందస్తు అభిప్రాయంతో తాము ముందుకు సాగబోమని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం.. ''కమిటీ మా విస్తరించిన చేయి వంటిది. దీనిలో ఎలాంటి మార్పులకూ మేం అంగీకరించం. ఇది సుప్రీంకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తుంది. పునర్వ్యవస్థీకరించం. కమిటీ తన పని చేయనివ్వండి. ఎక్కడైనా తప్పు జరిగిందని భావిస్తే మా దృష్టికి తీసుకురండి. బహిరంగ విచారణ నిర్వహిస్తాం'' అని స్పష్టం చేసింది. కమిటీలోని ఈశాన్య రాష్ట్ర మాజీ డీజీపీ ఒకరు దర్యాప్తులోకి వచ్చే అవకాశం ఉన్న ఉన్నతాధికారికి సన్నిహితుడని, అందువల్ల ప్రయోజనాల సంఘర్షణ ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వాదించారు. సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కమిటీ స్వతంత్రంగా పనిచేసేందుకు ప్రత్యేక అమికస్ క్యూరీ, అడ్వొకేట్–ఆన్–రికార్డ్ ఉండాలని, ప్రభుత్వ న్యాయవాది ద్వారా కమిటీకి ప్రాతినిధ్యం వహించకూడదని ఆయన కోరారు. ఈ వాదనలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. ఇలాంటి ఆరోపణలను పట్టించుకోవద్దని కోర్టును కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. ఈశాన్య రాష్ట్రానికి డీజీపీగా పనిచేసినందునే రిటైర్డ్ మేఘాలయ డీజీపీని కమిటీలోకి తీసుకున్నామని, ప్రధాన భూభాగంలోని రాజకీయ పార్టీలకు ఆయన సన్నిహితంగా ఉండే అవకాశం తక్కువని వివరించారు.

### ప్రజల నుంచి ఆధారాల స్వీకరణ

కమిటీ ముందు తమ అభిప్రాయాలు, సమాచారం, పత్రాలు, ఆధారాలు సమర్పించేందుకు ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తూ బహిరంగ ప్రకటన జారీ చేయాలని ధర్మాసనం తెలిపింది. అందిన సమాచారాన్ని కమిటీ పరిశీలిస్తుందని పేర్కొంది. కమిటీ సభ్య కార్యదర్శి రికార్డుల సంరక్షకుడిగా వ్యవహరించి, అందిన మొత్తం సమాచారాన్ని కమిటీ ముందుంచాలని సూచించింది. ఈ బాధ్యతను సాధారణంగా రిటైర్డ్ జిల్లా జడ్జి లేదా ఇతర న్యాయాధికారికి అప్పగించే అవకాశం ఉందని తెలిపింది. కమిటీ పునర్వ్యవస్థీకరణపై న్యాయవాదులు పట్టుబట్టడంతో జస్టిస్ బాగ్చి స్పందిస్తూ.. సంబంధిత సభ్యుడిపై వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను పరిశీలిస్తామని చెప్పారు. అయితే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో, తామే ఎంపిక చేసిన కమిటీలోని సభ్యుడిని ముందుగానే పక్షపాతిగా భావించడం మాత్రం అంగీకరించబోమని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే సీజేఐ నేతృత్వంలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలో పాల్గొన్నందుకు ఓ విద్యార్థికి షోకాజ్ నోటీసు జారీ చేసిన గ్రేటర్ నోయిడా ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌ను సస్పెండ్ చేసినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.

# సీఎంతో భేటీకి రాజకీయ రంగు పులమొద్దు!



**ప్రజానావ,హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తన భేటీపై జరుగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెరదించారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వ పెద్దలను కలవడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలో భాగమని స్పష్టం చేశారు. తన భేటీకి రాజకీయ కారణాలు ఆపాదించవద్దని కోరారు.

### 'మేం ఘర్షణ పడాలని కొందరి కోరిక'

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. అయితే రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు సహజమేనన్నారు. సీఎం, తన మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయని, మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయానంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.''ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు.. కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు'' అని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

### మంత్రి పదవిపై అధిష్ఠానానిదే నిర్ణయం

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ, మంత్రి పదవుల అంశం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని ఆయన స్పష్టం చేశారు. గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే తుది నిర్ణయం అధిష్ఠానానిదేనని, పార్టీ పెద్దలు తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని తెలిపారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి తప్పు లేదని రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై సీఎం అధిష్ఠానానికి సరైన సమాచారమే అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకులు, ప్రజాప్రతినిధులకు భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమేనన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయం స్వల్పమైనది కాదని రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వంతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి ప్రశంసలు కురిపించారు. రాజకీయంగా పార్టీలు వేరైనా ప్రజలకు మేలు చేసే నాయకుడి పనితీరును, నిబద్ధతను గుర్తించి అభినందించడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు.

### 'అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు'

మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఎమ్మెల్యే లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులుగా తాము ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదని అన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా తుమ్మల వెంటనే స్పందిస్తారని తెలిపారు. ఆదివారం, ఇతర సెలవు రోజుల్లోనూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన అందుబాటులో ఉంటారని చెప్పారు. సమీక్ష లు, ఇతర అధికారిక కార్యక్రమాల్లో ఉండి ఫోన్ ఎత్తలేకపోయినా.. వీలైనంత త్వరగా తిరిగి ఫోన్ చేసి మాట్లాడటం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు.

### సమస్య పరిష్కారం వరకు పర్యవేక్షణ

నియోజకవర్గాలు, ప్రజలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తీసుకెళ్లినప్పుడు తుమ్మల ఎంతో ఓపికగా విని స్పందిస్తారని ఎమ్మెల్యేలు తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులతో స్వయంగా మాట్లాడి పరిస్థితిని పర్యవేక్షిస్తారని చెప్పారు.పని ఏ దశలో ఉందో, ఎప్పటిలోగా పరిష్కారమవుతుందో కూడా తిరిగి ఫోన్ చేసి సమాచారం ఇవ్వడం తుమ్మల ప్రత్యేకత అని కొనియాడారు.

### 'ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి'

కొత్తగా ఎన్నికైన శాసనసభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సామర్థ్యం, ఓపిక, జవాబుదారీతనాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పాయల్ శంకర్, రాకేశ్‌రెడ్డి సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయాలకు అతీతంగా పనిచేసే నాయకులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

# పంచాయతీల ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే!

**హైదరాబాద్:** గ్రామపంచాయతీల సొంత వనరుల ద్వారా సమకూరే ఆదాయాన్ని ఇకపై ప్రభుత్వ ట్రెజరీలో జమ చేయకుండా నేరుగా పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018లోని సెక్షన్ 70(3) ను సవరించే బిల్లును పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రవేశపెట్టగా.. శాసనసభలో చర్చ అనంతరం ఆమోదించింది. ప్రస్తుతం గ్రామప ంచాయతీలు పన్నులు, ఇతర సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే నిర్దిష్ట ప్రక్రియ ద్వారా ట్రెజరీ నుంచి డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల కారణంగా నిధుల వినియోగంలో కొన్నిసార్లు జాప్యం జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది.కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘాల నుంచి వచ్చే నిధులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్న విధంగానే గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని కూడా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. దీనివల్ల స్థానిక అవసరాలకు నిధులను మరింత వేగంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. గ్రామపంచాయతీల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా రూ.54 కోట్లు విడుదల చేస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచిపోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రెండేళ్లుగా నిలిచిపోయాయని, ఎన్నికల అనంతరం పెండింగ్ నిధులు క్రమంగా విడుదల అవుతున్నాయని చెప్పారు. కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల రాష్ట్రంపై అదనంగా సుమారు రూ.2,000 కోట్ల భారం పడుతున్నప్పటికీ.. ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 2018లో స్టాంప్ డ్యూటీని తొలగించడం వల్ల స్థానిక సంస్థలు కొంత ఆర్థిక సంక్షోభంలో పడ్డాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల వరకు పెండింగ్ నిధులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. వివిధ కారణాలతో ఎన్నికలు జరగని పంచాయతీలకు ప్రభుత్వమే నిధులు సమకూరుస్తోందని సభకు వివరించారు.



# జిన్‌పింగ్ భారత్ పర్యటన ఖరారు!

**న్యూఢిల్లీ:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్ పర్యటనపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు రానున్నారు. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వ రంగ మీడియా సంస్థ జిన్హువా అధికారికంగా వెల్లడించింది.

### 12, 13 తేదీల్లో బ్రిక్స్ సదస్సు

దిల్లీలోని భారత్ మండపంలో ఈ నెల 12, 13 తేదీల్లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. సభ్య దేశాల అగ్రనేతలు ఈ సమావేశానికి హాజరు కానుండగా.. జిన్‌పింగ్ పర్యటనపై మాత్రం కొంతకాలంగా స్పష్టత లేకుండా పోయింది. ఆయన రాకపై చైనా విదేశాంగ శాఖకూ అధికారిక సమాచారం లేదని గతంలో ప్రకటించడంతో సందిగ్ధత నెలకొంది. తాజాగా జిన్హువా ప్రకటనతో స్పష్టత వచ్చింది.

### సరిహద్దు వివాదాల మధ్య పర్యటన

భారత్–చైనా మధ్య సరిహద్దు వివాదాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. 1962 యుద్ధం అనంతరం ఇరు దేశాల మధ్య సంబంధాల్లో ఉద్రిక్తతలు కొనసాగగా.. 2020లో గల్వాన్ ఘర్షణతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. అయితే ఇటీవలి కాలంలో రెండు దేశాలు సంబంధాలను మెరుగుపర్చుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. గతేడాది షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సుకు ప్రధాని మోదీ హాజరైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, సరిహద్దు అంశాలు తదితర కీలక విషయాలపై చర్చ జరిగే అవకాశముంది.

# ఉత్తమ సింగర్‌గా గుగ్గిళ్ల శ్రీనికగౌడ్




ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణ భాష దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని మండేపల్లి ఆదర్శ పాఠశాలలో వివిధ సాంస్కృతిక విభాగాలలో పోటీలను నిర్వహించారు . అందులో భాగంగా తెలంగాణ యాస , భాషలపై నిర్వహించిన పాటల పోటీ విభాగంలో , 6 వ తరగతి చదువుతున్న గుగ్గిళ్ల శ్రీనిక గౌడ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి, పాఠశాల స్థాయిలో ఉత్తమ సింగర్ గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్, ఉపాధ్యాయులు శ్రీనిక కు మెమోంటో ఇచ్చి అభినందించారు . అలాగే మండేపల్లి సర్పంచ్ గాదగోని సాగర్, ఇందిరమ్మ కాలనీ సర్పంచ్ గడ్డం రచన మధుకర్, సారంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల లావణ్య, నరసయ్యలు శ్రీనికను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో గొప్ప సింగర్ గా ఎదగాలని ఆకాంక్షిస్తూ అభినందించారు.

# రేపు జాతీయ లోక్ అదాలత్

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల**




ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలోని అన్ని కోర్టు సముదాయాల్లో ఈ నెల 12న న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. గురువారం జిల్లా కోర్టు సముదాయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల మాట్లాడుతూ ఈ ఈ నెల 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, భూ వివాదాలు, మోటార్ వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, బ్యాంకు రికవరీ మరియు చెక్ బౌన్స్ కేసులతో పాటు కుటుంబ తగాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవచ్చని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన కేసులపై ఎలాంటి అప్పీల్ లేదా రివిజన్లకు అవకాశం ఉండదని, కేసు ఇక్కడితో పూర్తిగా క్లోజ్ అవుతుందని పేర్కొన్నారు. దీనివల్ల ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే అవసరం తప్పి మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కేసు రాజీ పరిధిలోకి వస్తుందో లేదో తెలుసుకోవడానికి న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే కోర్టు కేసుల్లో వాదించేందుకు ఆర్థిక స్తోమత లేని అర్హులైన పేదలకు న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరంజిల్లా అధనపు న్యామూర్తీ కుచం సునిత,న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీనీజ కోహిర్కర్ తో కలిసి లోక్ అదాలత్ పోస్టర్ ఆవిష్కరించారు.



# వేద విద్యలో వేములవాడ విద్యార్థుల విజయకేతనం

- ప్రథమ శ్రేణిలో ఐదుగురు..
- ఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు

ప్రజానావ, వేములవాడ: వేద విద్యలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర వేద పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన సామవేద పరీక్షల్లో ఐదుగురు విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో కే. లక్ష్మి నరసింహ శర్మ (మంథని), ఎస్. వినాయక శర్మ (కరీంనగర్), ఎం. షణ్ముఖ శర్మ (మెట్‌పల్లి), ఆర్. షణ్ముఖ శర్మ (జమ్మికుంట), ఏ. సత్యనారాయణ శాస్త్రి (వేములవాడ) ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎల్. రమాదేవి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. వేద విద్యలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో మామ, మేనకోడలు మృతి

ప్రజానావ, ముంబై: గోండియా జిల్లా తిరోడా తాలూకా గుమాధవడ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఇంట్లో కూలర్‌లో నీళ్లు నింపు తుండగా విద్యుత్ షాక్‌కు గురై మామ భాగ్యవాన్ బావనే, మేనకోడలు సుప్రియా సురేష్ సోంటక్కే అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం మధ్యాహ్నం కూలర్‌లో నీళ్లు పోస్తుండగా ఇనుప భాగం లోకి విద్యుత్ ప్రవహించడంతో ఈ ప్రమాదం జరిగి నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసు లు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టా రు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ
- పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే



ప్రజనావ, సిరిసిల్ల : పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే ప్రారంభించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. రెండు వేల విగ్రహాలను పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి)తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని కోరారు. పర్యావరణహితమైన గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రకృతి, జలవనరులను కాపాడుతూ భక్తిశ్రద్ధలతో పండుగను చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

ప్రజానావ, గంభీరావుపేట: చాకలి ఐలమ్మ వర్ధంతి గురువారం గంభీరావుపేట మండల కేంద్రంలో జరిగాయి. వర్ధంతిని పురస్కరించుకొని ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో సర్పంచ్ మల్లు గారి పద్మ,, కాంగ్రెస్ బిజెపి బిఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు నిమ్మల తిరుపతి గౌడ్, కోడె రమేష్, పాపగారి వెంకటస్వామి గౌడ్, మాజీ జెడ్పిటిసి మల్లు గారి నర్సా గౌడ్, రజక సంఘం మండల ప్రధాన కార్యదర్శి గూడెపు రవి, నాయకులు బాల బూదయ్య, దీటీ నరసింహులు, రమేష్, అశోక్, అంజయ్య లతోపాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యుత్ కోతలపై రోడ్డెక్కిన రైతులు

**కామారెడ్డి - సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయింపు**

ప్రజానావ, గంభీరావుపేట: విద్యుత్ కోతలు నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. ఆగ్రహించిన గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన రైతులు గురువారము ధర్నా రాస్తారోకో నిర్వహించారు. మండల పరిధిలోని లింగన్నపేట సబ్ స్టేషన్ రహదారిలోని కామారెడ్డి– సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. విద్యుత్ కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్రటిక విద్యుత్ కోతతో వేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయని మండిపడ్డారు. లోవోల్టేజీతో వ్యవసాయ మోటర్లు, ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోతున్నాయని వాపోయారు. తక్షణం లో వోల్టేజ్ సమస్యను పరిష్కరించి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి వెళ్లి రైతులను శాంతింపజేశారు. ఎస్పై డిఈ ఫోన్లో మాట్లాడగా రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఏఈ ఆనంద్ కుమార్ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో రైతులు గాండ్ల రాజం, సందీప్ రెడ్డి, మెతుకు రాజు పత్తేంఆంజనేయులు, కొండం ఎల్లం, గుమ్మడి భిక్షపతి, మేకల నారాయణ, పాతూరి బాల్ రెడ్డి, మంద రవీందర్, రామచంద్రం, బండ దేవరాజు, రాజి రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, రమేష్ రెడ్డిలు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత అవగాహన

**జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



ప్రజానావ, సిరిసిల్ల : ఎస్ఐ, కానిస్టేబుల్ అలాగే వివిధ పోటీ పరీక్షల కు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకుని పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అవగాహన సదస్సుకు పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు శనివారం ఉదయం 08:30 గంటలకు సిరిసిల్ల పట్టణంలోని లహరి బ్రాంకేట్ హాల్ లో హాజరు కావాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్ట్రెస్ మేనేజ్‌మెంట్, సబ్జెక్టుల వారీగా నిపుణులచే శిక్షణ, పరీక్షల విధానం, సమయపాలన, పరీక్షల కు సమర్థవంతంగా సన్నద్ధం కావడానికి అవసర మైన ముఖ్యమైన సూచనలు సదస్సులో అందించనున్నట్లు తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ కల్పిస్తున్న ఈ సదవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని, తమ నైపుణ్యాలను పెంపొందించుకుని పోటీ పరీక్షల్లో విజయాన్ని సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు.



# విమోచన దినోత్సవం నిర్వహించాలి

**తహసీల్దార్‌కు బీజేపీ నాయకుల వినతి**

ప్రజానావ, గంభీరావుపేట: 17 సెప్టెంబర్ న తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని కోరుతూ గంభీరావుపేట బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. మండల బిజెపి అధ్యక్షుడు కోడె రమేష్ అధ్యక్షతన నాయకులు తహసీల్దార్ మారుతి రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు అత్యంత విశిష్టమైన స్థానం ఉండి, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు సాగించిన పోరాటం, రజాకార్ల దమనకాండను ఎదురించి సాధించిన విమోచన దినోత్సవం గా వివరించారు. వేలాది మంది ప్రజల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమైన చరిత్ర ఉన్న సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిగా అధికారికంగా తెలంగాణ దినోత్సవం నిర్వహించాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, ధార్మిక సెల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి జమున, ఉపాధ్యక్షులు యలేందర్, నర్సింలు, కార్యదర్శి రాజు, నాయకులు సర్వోత్తమ్, శ్రీనివాస్, దేవా గౌడ్, రవీందర్, తిరుపతి, మహేష్, దేవేందర్ యాదవ్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ**

ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అన్యాయాన్ని ఎదిరించి సాగించిన విరోచిత పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమైందని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ అన్నారు. గురువారం సిరిసిల్ల రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ చౌరస్తాలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ పాల్గొని చాకలి ఐలమ్మ కు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల రజక సంఘం అధ్యక్షులు దండు శ్రీనివాస్, నెహ్రు నగర్ రజక సంఘం అధ్యక్షుడు మారుపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాసర్ల మహేందర్, సిహెచ్ బాలరాజు, దండు ఎల్లయ్య, వేములవాడ శ్రీనివాస్, రజక కుల బాంధవులు పాల్గొని చాకలి(చిట్యాల) ఐలమ్మ కి నివాళులర్పించారు.



# కుటుంబ కలహాలకు దంపతులు బలి

- రైలు కింద పడి భర్త మృతి
  పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్య
- పెళ్లయిన 15 నెలలకే విషాదాంతం



ప్రజానావ, హైదరాబాద్ : కుటుంబ కలహాలు ఓ దంపతుల నిండు జీవితాలను బలిగొన్న విషాద ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయపురి కాలనీలో చోటుచేసుకుంది. పెళ్లయిన 15 నెలలకే భార్యాభర్తలు బలవన్మరణానికి పాల్పడటంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కర్ణాటకలోని కలబురగి జిల్లా అఫ్జల్‌పూర్‌కు చెందిన శరణప్ప (28)కు 15 నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన లక్ష్మి (24)తో వివాహమైంది. పెళ్లి అనంతరం దంపతులు తార్నాక విజయపురిలోని తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నారు. శరణప్ప నాచారంలోని ఓ టీ పాయింట్‌లో పనిచేస్తుండగా, లక్ష్మి ఇంటి వద్దే ఉంటోంది. వివాహం తర్వాత తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నట్లు బంధువులు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా కర్ణాటక వెళ్లిన వారు 10 రోజుల క్రితం తిరిగి వచ్చారు. అప్పటి నుంచి మళ్లీ కలహాలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం ఉదయం కూడా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శరణప్ప తండ్రితో కలిసి టీ తాగేందుకు బయటకు వచ్చి, తిరిగి వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. అనంతరం సికింద్రాబాద్–మౌలాలి అప్‌లైన్‌లోని కిలోమీటర్ నంబర్ 197/39–4 వద్ద గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు సమాచారం ఇవ్వడంతో శరణప్ప తండ్రి ఈ విషయాన్ని ఇంట్లో తెలిపాడు. భర్త మృతిచెందిన విషయం తెలుసుకున్న లక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న లాలాగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శరణప్ప మృతిపై జీఆర్పీ పోలీసులు, లక్ష్మి ఆత్మహత్యపై లాలాగూడ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

- డీజేలకు అనుమతి లేదు
- మండపాలు, నిమజ్జన ప్రాంతాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



ప్రజానావ, రంగారెడ్డి : జిల్లాలో వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ స్నేహ మెహర, అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు ఎస్పీతో కలిసి గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనానికి అవసరమైన రూట్‌మ్యాప్‌లు సిద్ధం చేసి, ఆయా మార్గాల్లో రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నిమజ్జన చెరువుల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ఫస్ట్‌ఎయిడ్ కిట్లతో వైద్య సిబ్బంది బృందాలను అందుబాటులో ఉంచాలని, భారీ క్రేన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిమజ్జనం సాయంత్రం వేళ జరిగే నేపథ్యంలో నిరంతర విద్యుత్ సరఫరాకు అవసరమైన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, విద్యుత్ తీగల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతి చెరువు వద్ద విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. మండపాలకు విద్యుత్ శాఖ అధికారుల సహకారంతో విద్యుత్ కనెక్షన్లు తీసుకోవాలని, గణేష్ నవరాత్రుల ప్రారంభం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. చెరువుల వద్ద బారికేడ్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని, అగ్ని ప్రమాదాల నివారణపై మండపాల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం రోజున ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో పండుగ నిర్వహించేలా ఉత్సవ కమిటీలు పోలీసులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ప్రతి ఒక్కరూ గణేష్ మండప వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా ఉత్సవ కమిటీలు చర్యలు తీసుకోవాలని, ఆ వివరాల ఆధారంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద వాలంటీర్లు ఉండేలా చూసుకోవాలని, మండపాల ఏర్పాటుతో రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హిందూ సంప్రదాయాలకు అనుగుణంగా భజన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రతి మండపం వద్ద అవసరమైన బందోబస్తు, నిమజ్జన సమయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడతామని ఎస్పీ వెల్లడించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాజేష్ మీనా, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, డీఆర్‌ఓ స్వర్ణలత, వికారాబాద్, తాండూర్, పరిగి, కొడంగల్ ఉత్సవ కమిటీల సభ్యులు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులకే ప్రాధాన్యం ఇవ్వాలి

- పర్యావరణ పరిరక్షణే లక్ష్యం
- 13న గాయత్రీనగర్‌లో మట్టి విగ్రహాల పంపిణీ



ప్రజానావ, హైదరాబాద్ : 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో వీధులు మారుమోగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాలు సిద్ధమవుతున్న వేళ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని లక్ష్మణ్ గుప్త పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఉత్సవాల సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల వల్ల పరిసరాలు, నీటి వనరులు కాలుష్యానికి గురయ్యే అవకాశం ఉన్నందున 'మన పండుగ–మన పర్యావరణం' అనే నినాదంతో మట్టి గణపతులను మాత్రమే ప్రతిష్ఠించాలని ఆయన సూచించారు. ఈ ఉద్దేశంతో లక్ష్మణ్ గుప్త ఆధ్వర్యంలో గాయత్రీనగర్ గాంధీ బొమ్మ సర్కిల్ వద్ద ఈ నెల 13న మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

# నకిలీ స్క్రీన్‌షాట్‌తో ఏటీఎం మోసాలు

**అత్యవసరంగా నగదు కావాలంటూ నమ్మించి రూ.10 వేలు కాజేత.. నిందితుడి అరెస్ట్**

ప్రజానావ, హైదరాబాద్ : ఏటీఎం కేంద్రాల వద్ద మాటువేసి నగదు అవసరంలో ఉన్న వారిని నకిలీ స్క్రీన్‌షాట్లతో మోసం చేస్తున్న వ్యక్తిని మీర్‌చౌక్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ శ్యామ్‌సుందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జేజే నగర్‌కు చెందిన కందూరి నవీన్ (28) ఈనెల 5న పురానాహవేలిలోని సిటీ సివిల్ కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంకు రూ.20 వేల నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్లాడు. అక్కడకు వచ్చిన తలాబ్‌కట్టకు చెందిన అబ్దుల్లా ఒబైద్ బిన్ అబ్దత్ అల్ కతేరీ అలియాస్ అబ్దుల్లా (25) అత్యవసరంగా డబ్బు కావాలని చెప్పి రూ.10 వేలు ఇస్తే ఫోన్‌పే ద్వారా పంపిస్తానని నమ్మించాడు. నవీన్ గూగుల్‌పే క్యూఆర్ కోడ్ చూపించగా, స్కాన్ చేసినట్లు చేసి రూ.10 వేలు బదిలీ అయిన నకిలీ స్క్రీన్‌షాట్ చూపించాడు. అది నిజమని నమ్మిన నవీన్ రూ.10 వేలు నగదు ఇవ్వగా, నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఖాతాలో నగదు జమ కాలేదని గుర్తించిన నవీన్ మీర్‌చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీ, ఇతర ఆధారాలతో నిందితుడిని గుర్తించిన పోలీసులు అరెస్ట్ చేసి నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

# జీవో 97పై పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

**రామంతపూర్‌లో ఉద్రిక్తత**




ప్రజానావ, హైదరాబాద్ : జీవో 97ను రద్దు చేయాలని, పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకురావద్దని డిమాండ్ చేస్తూ రామంతపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక ఆందోళన గురువారం ఉద్రిక్తంగా మారింది. 20 రోజులుగా తరగతులను బహిష్కరించి నిరసన కొనసాగిస్తున్న విద్యార్థులు కళాశాల నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో స్వల్ప తోపులాట జరిగింది. జీవో 97పై అసెంబ్లీలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, స్కిల్ యూనివర్సిటీ ప్రతిపాదిత పీపీపీ విధానం, కరిక్యులమ్ మార్పులపై ఆందోళనలను పరిష్కరించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.



# ప్రైవేటీకరణ మొగ్గు?

ఇస్రో అంతరిక్ష యానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపొదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటి ఎన్నో పరిశోధన లతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికార్లై చెక్కర్లు కొడుతోంది. ఒద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది.

ఇస్రో అంటే నేటి ప్రపంచంలో తెలియని వారుండరు. ఇస్రో అంతరిక్ష యానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపొదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటి ఎన్నో పరిశోధన లతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికార్లై చెక్కర్లు కొడుతోంది. ఒద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయి. జరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తలు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ ఒద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటవ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది వలం ఉద్యోగుల అసంతప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్–స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సవహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంతిక అభివద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వ రంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంత వరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్ర ణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవా ల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమించుకోవాలి. ప్రైవేటు దిశగా ప్రయత్నాలు చేస్తే దేశ అడ్డుకొని ప్రైవేటు పరంగా కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ్ ప్రజలపై ఎంతైనా ఉంది.

పభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దు లు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయ ని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంత వరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్ర ణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవా ల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమిం చుకోవాలి.



# చాకలి ఐలమ్మ పోరాటాలు స్ఫూర్తిదాయకం

**ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, అమరవీరురాలు చాకలి ఐలమ్మ పోరాటాలు అపారమైన స్ఫూర్తినిస్తాయని రజక సంఘం నాయకులు పేర్కొన్నారు. రేవల్లి మండల పరిధిలోని నాగపూర్ గ్రామంలో రజక సంఘం అధ్యక్షుడు చిట్టిరాజుల మల్లేష్, కోశాధికారి గుడ్లనారి బొందయ్య, బొడ్డిపల్లి నిరంజన్ సలహారాడు ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... నాడు దొరల, భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా, తన హక్కుల సాధన కోసం చాకలి ఐలమ్మ సాగించిన వీరోచిత పోరాటం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. బహుజనుల హక్కుల కోసం, మహిళా చైతన్యం కోసం ఆమె చూపిన బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేయాలి

- కేసీఆర్‌పై వ్యాఖ్యలకు చర్యలు తీసుకోవాలి.. మాజీ ఎంపీపీ సీతయ్య డిమాండ్



**ప్రజానావ, తుంగతుర్తి :** అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య డిమాండ్ చేశారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను తీవ్రంగా ఖండించారు. కేసీఆర్ మరణాన్ని కోరుకుంటున్నానంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు కొందరు కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని హేయమైన చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, గోపగాని వెంకన్న, తాళ్లపల్లి యాకయ్య, మల్లెపాక రాములు, గడ్డం సోమేష్, పాలడుగు జలంధర్, బొజ్జ సాయికిరణ్ పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరవనిత చాకలి ఐలమ్మ చేసిన పోరాటం అజరామరమని, నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ తుంగతుర్తి మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, గోపగాని వెంకన్న, తాళ్లపల్లి యాకయ్య, మల్లెపాక రాములు, గడ్డం సోమేష్, పాలడుగు జలంధర్, బొజ్జ సాయికిరణ్ పాల్గొన్నారు.



# క్రీడలతో మానసిక వికాసం

**మోరంపల్లిబంజర్‌లో మండలస్థాయి పాఠశాలల క్రీడలు ప్రారంభం**

**ప్రజానావ, బూర్గంపహాడ్ :** మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఎంపీడీవో జమలారెడ్డి అన్నారు. గురువారం మోరంపల్లిబంజర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో యదుసింహరాజుతో కలిసి మండల స్థాయి పాఠశాలల క్రీడలను ప్రారంభించారు. అండర్–17, అండర్–14 విభాగాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, 100, 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలు నిర్వహించారు. ఈనెల 10, 11 తేదీల్లో జరిగే పోటీల్లో విద్యార్థులు, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంపీడీవో ఆకాంక్షించారు. బాలికలకు శుక్రవారం క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొర్రా సుభద్ర, ఉపసర్పంచ్ పొక్కుల రవి, డోనర్ రైస్ మిల్లు నిర్వాహకులు రామచంద్రారెడ్డి, ఆదర్శ రైతు గాదె నర్సిరెడ్డి, పీడీలు కృష్ణ, బాబూరావు, పూర్ణ, జనార్ధన్, సుకన్య, నాగలక్ష్మి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇరవెండి యూపీఎస్‌ను సందర్శించిన ఎంఈవో

మండలంలోని ఇరవెండి యూపీఎస్ పాఠశాలను ఎంఈవో యదుసింహరాజు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి స్కూల్ గార్డెన్‌లో పెంచుతున్న ఔషధ మొక్కలను పరిశీలించారు. రణపాల, తులసి, అలోవీరా మొక్కలను పెంచుతున్న హెచ్‌ఎం సత్యనారాయణను అభినందించారు. అనంతరం తరగతి గదిలో ఉపాధ్యాయురాలు తులసి బోధిస్తున్న తీరును పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జగన్ పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై వ్యాఖ్యలకు నిరసన

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై పోలీసులకు ఫిర్యాదు
- బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్

**ప్రజానావ, రాయపోల్ :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాయపోల్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టారు. కేసీఆర్ మృతిని కోరుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యువజన విభాగం నాయకుడు ఇప్ప దయాకర్ నేతృత్వంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మానసకు ఫిర్యాదు చేశారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ అనేక ఉద్యమాలు చేసి, అన్ని వర్గాల ప్రజలను ఏకం చేసి ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ మృతిని కోరడం ఎమ్మెల్యేకు తగదన్నారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శంకర్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ హనుమంతు రాజు, మాజీ ఎంపీటీసీ మాదాసు రాజగౌడ్, మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్, ఉపసర్పంచ్ బందరం సంతోష్, మండల బీఆర్ఎస్ నాయకులు మాదాసు నవీన్, మంజూర్, మహేష్, రాంపల్లి సతీష్, అశోక్, బాలకృష్ణ, కొంగరి శ్రీకాంత్, నాంసాని స్వామి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు, అన్నప్రాసనలు

**ఐసీడీఎస్ మాసోత్సవాల్లో భాగంగా వేడుకలు**

**ప్రజానావ, బూర్గంపహాడ్ :** ఐసీడీఎస్ మాసోత్సవాల్లో భాగంగా బూర్గంపహాడ్ మండలం అంజనాపురం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బానోతు నర్సింహ మాట్లాడుతూ గర్భిణులు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారం తీసుకుంటేనే పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ స్వరాజ్యం, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



# అన్నదాతలకు కరెంట్ కోతల కష్టాలు

- పొంగులేటి నియోజకవర్గంలో రైతుల నిరసన
- 'పక్క నియోజకవర్గంలో 24 గంటలు.. మాకెందుకు కోతలు?

**ప్రజానావ, నేలకొండపల్లి :** కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు తప్పడం లేదని ఆరోపిస్తూ పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఆలస్యమైన వర్షాలు, యూరియా కొరతకు తోడు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గంలోనే రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపించారు. పక్కనే ఉన్న మధిర నియోజకవర్గంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందుతుండగా, పాలేరులో మాత్రం రోజుకు 6 నుంచి 10 గంటల వరకే కరెంట్ వస్తోందని ఓ రైతు ఆగ్రహం వ్యక్తం చేశారు. "మధిరలో 24 గంటలు ఇస్తున్నారు.. మరి మనం పాకిస్థాన్‌లో ఉన్నామా? పాలేరులో ఉన్నామా?" అంటూ ప్రశ్నించారు. తమ సమస్యపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గ్యారంటీల అమలుపై ప్రశ్నిస్తే అరెస్ట్

- బీఆర్ఎస్వీ నేత జక్కి నగేశ్ ముందస్తు అరెస్ట్
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్




**ప్రజానావ, బీబీనగర్ :** కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీకి వెళ్లకుండా బీఆర్ఎస్వీ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్‌ను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. గురువారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో బీబీనగర్ మండలం రాఘవపురంలోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఎం ఇంటి ముట్టడికి వెళ్తారనే భయంతోనే నిద్రిస్తున్న తనను అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేశారని జక్కి నగేశ్ ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమే నన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన సుమారు రూ.11,300 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, యూత్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసే జీవో 97ను రద్దు చేయాలని, దళితులకు అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇవ్వాలని కోరారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఫీజులు చెల్లించేందుకు నిధులు విడుదల చేయకుండా మంత్రులు, అధికారుల సమావేశాలకు కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం దారుణమని విమర్శించారు. నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం హరిస్తోందని, అర్ధరాత్రి ఇంటికి వచ్చి అరెస్టు చేయడం సరికాదని జక్కి నగేశ్ మండిపడ్డారు.



# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల తనిఖీలు

- సారపాకలో వాహనదారులకు అవగాహన
- మద్యం తాగిన వారికి జరిమానాలు

**ప్రజానావ, బూర్గంపహాడ్ :** బూర్గంపహాడ్ మండలం సారపాక ప్రధాన సెంటర్‌లో ఎస్ఐ మేడా ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. వాహనదారులను ఆపి మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నివారణకు సహకరించాలని అవగాహన కల్పించారు. అనంతరం మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగభిక్షం, పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఏఈఓ మృతి

- విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా ప్రమాదం
- చికిత్స పొందుతూ మృతి

**ప్రజానావ, జోగులాంబ గద్వాల :** జిల్లాలోని అయిజ పట్టణానికి చెందిన నీలద్ది శ్రీకాంత్ (48) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామ ఇన్‌చార్జి ఏఈఓగా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం విధులు ముగించుకుని సాయంత్రం ద్విచక్ర వాహనంపై భారత్‌మాల రోడ్డు మీదుగా అయిజకు తిరిగి వస్తుండగా వెంకటాపూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో కర్నూలులోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.



అయితే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# నర్సరీలపై అధికారుల నిర్లక్ష్యం

- మొక్కలు వాడిపోతున్నా పట్టించుకోని వైనం
- కలుపు, చెత్తతో అధ్వానంగా మీర్జాపూర్ నర్సరీ

**ప్రజానావ, జహీరాబాద్ :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలకు ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నర్సరీలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలం మీర్జాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ ఇందుకు నిదర్శనంగా మారింది. హరితహారం లక్ష్యంలో భాగంగా వేలాది మొక్కలను నల్ల పాలిథిన్ కవర్లలో పెంచుతున్నప్పటికీ, సరైన సంరక్షణ లేకపోవడంతో అవి వాడిపోతున్నాయి. నర్సరీ మొత్తం కలుపు మొక్కలతో నిండిపోగా, అనేక కవర్లలో మొక్కలు ఎండిపోయి ఖాళీగా కనిపిస్తున్నాయి. నీరు లేక నేల బీటలు వారడంతోపాటు మొక్కల మధ్య ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త పేరుకుపోయాయి. లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్వహిస్తున్న నర్సరీని పర్యవేక్షించాల్సిన అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా నీరు పోయకపోవడం, కలుపు తొలగించకపోవడంతో మొక్కలు చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా, మండల ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మీర్జాపూర్ నర్సరీని సందర్శించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతోపాటు మిగిలిన మొక్కలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రత్యేక నైపుణ్యాలే వారి బలం

- దివ్యాంగులు అనే కంటే ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన పిల్లలు అని ప్రోత్సహించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు




ప్రజానావ, పెద్దపల్లి : శిక్షణ, జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల తల్లిదండ్రుల కోసం జిల్లా స్థాయి కార్యక్రమం గురువారం పెద్దపల్లిలోని శ్రీనివాస గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.శ్రీరాములు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల సమగ్ర అభివృద్ధి, విద్య, ఆరోగ్యం మరియు భవిష్యత్ అవకాశాల కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులను కేవలం "దివ్యాంగులు" అని పిలవడం కంటే, వారిలో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, ప్రోత్సహించి, వారి ప్రతిభను వెలికితీయడం సముచితమని అన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నమ్మకంతో, ప్రేమతో, ప్రోత్సాహంతో ముందుకు నడిపించాలని సూచించారు. వైకల్యాన్ని అధిగమించి స్ఫూర్తిగా నిలిచిన అంజారెడ్డి కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న అంజారెడ్డి తన జీవిత అనుభవాలను పంచుకున్నారు. సుమారు 25 సంవత్సరాల క్రితం జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లను కోల్పోయినప్పటికీ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తన ప్రయాణాన్ని వివరించారు. ఆయన అందించిన ప్రేరణాత్మక సందేశం సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల తల్లిదండ్రులకు దిక్సూచిగా నిలిచింది. దివ్యాంగుల ప్రతిభకు విద్యే బలమైన సాధనం డా. మధుసూదన్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్, ఎస్ఆర్ఆర్ కళాశాల మాట్లాడుతూ, దివ్యాంగులైన అనేక మంది అధ్యాపకులు తమ ప్రతిభతో ఉన్నతంగా రాణించి, వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన చేసిన అనుభవాలను పంచుకున్నారు. సరైన అవకాశాలు, ప్రోత్సాహం అందిస్తే సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులు కూడా సమాజంలో గొప్ప విజయాలు సాధించగలరని తెలిపారు. తల్లిదండ్రులే సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు అండ హైదరాబాద్‌కు చెందిన ఎన్జీవో ప్రతినిధి హరిబాబు మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల జీవితంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ప్రేమ, సంరక్షణ, ప్రోత్సాహం మరియు అండదండల వల్లే పిల్లలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగగలరని వివరించారు. సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లల శారీరక, మానసిక వికాసంపై సూచనలు డా. ఏ. జగదీష్, సీనియర్ కన్సల్టెంట్ – నియోనేటల్ & పీడియాట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్, (న్యూరో డెవలప్‌మెంటల్ డిజెబిలిటీస్), డెవలప్‌మెంటల్ పీడియాట్రిక్స్, హెచ్ఓడీ – సిడబ్ల్యూఎస్ఎన్, అపోలో హాస్పిటల్స్, హైదరాబాద్, సిడబ్ల్యూఎస్ఎన్ పిల్లల శారీరక, మానసిక, న్యూరో డెవలప్‌మెంటల్ వికాసానికి అవసరమైన అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లల అభివృద్ధిలో ప్రారంభ దశలోనే సరైన గుర్తింపు, చికిత్స, శిక్షణ, నిరంతర పర్యవేక్షణ ఎంతో ముఖ్యమని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ. కోఆర్డినేటర్ శ్రీమతి జి. కవిత, ప్లానింగ్ కోఆర్డినేటర్ చేపూరి మల్లేష్ గౌడ్, డా. మధుసూదన్ రెడ్డి, డా. ఏ. జగదీష్, హరిబాబు, మండల విద్యాధికారులు, సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల తల్లిదండ్రులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. సిడబ్ల్యూఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారికి సమాన అవకాశాలు కల్పిస్తూ, విద్యా – సామాజిక –ఆరోగ్య పరంగా సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ కార్యక్రమం ద్వారా పిలుపునిచ్చారు.

## కేసీఆర్‌కు ముక్రా(కె) గ్రామస్థుల సంఘీభావం

- క్షీరాభిషేకం చేసి గత సంక్షేమాన్ని గుర్తుచేసుకున్న గ్రామస్థులు

ప్రజానావ, ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామస్థులు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మరోసారి పూర్తి సంఘీభావం తెలిపారు. గురువారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, ఆయన పాలనలో దళితులు, రైతులు, పేదలకు అందిన సంక్షేమాన్ని గుర్తుచేసుకున్నారు. దళిత బస్తీ పథకం కింద దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి మూడు ఎకరాల భూమి అందించి, కూలీలుగా ఉన్న వారిని రైతులుగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. దళితుల కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ఆయన పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. దళిత డిక్లరేషన్ పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దళితులను మోసం చేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో రైతులకు దరఖాస్తులు లేకుండానే రైతుబంధు, ఆడపిల్లల వివాహాలకు కళ్యాణలక్ష్మి, రైతు కుటుంబాలకు రైతుబీమా కింద రూ.5 లక్షలు, బాలింతలకు కేసీఆర్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలు అందాయని ప్రశంసించారు. రేవంత్‌రెడ్డి 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, తిరుపతి, విఠల్, మారుతి, దత్త, ప్రహ్లాద్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఖేలో ఇండియా ఖోఖో ఎంపికలు

బాలబాలికల ఎంపికలకు 12న జేఎన్ఎస్‌లో ట్రయల్స్

ప్రజానావ, హనుమకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లా ఖో ఖో సంఘం ఆధ్వర్యంలో ఈనెల 12న హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో ఉదయం 9 గంటలకు ఖేలో ఇండియా ఖో ఖో బాలబాలికల ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి శ్యాం ప్రసాద్ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి కలిగిన ఖో ఖో క్రీడాకారులు ఈ ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. ఎంపికైన బాలబాలికలు రాష్ట్రస్థాయిలో నిర్వహించే ఖేలో ఇండియా ఖో ఖో ఎంపిక పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని శ్యాం ప్రసాద్ పేర్కొన్నారు.

## అన్యాయానికి ఎదురునిలిచిన ఐలమ్మ త్యాగం చిరస్మరణీయం

ప్రజానావ, వేములవాడ: వీరనారి చాకలి ఐలమ్మ త్యాగం చిరస్మరణీయమని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం చెక్కపల్లి బస్టాండ్ వద్ద పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుల్కం రాజు మాట్లాడుతూ.. భూస్వామ్య దౌర్జన్యాలకు, అన్యాయానికి ఎదురొడ్డి అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూం మధు, కౌన్సిలర్లు తోట రాజు, ఇప్పపూల అజయ్, కొక్కుల బాలకృష్ణ తదితరులు పాల్గొని ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.

## గణేష్ ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దాం

- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి
- గణేష్ మండపాల నిర్వాహకులు పోలీసులు, ఎన్ పీడీసీఎల్ అధికారుల వద్ద వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వినాయక చవితి నేపథ్యంలో ఎస్పీ మహేష్ బి. గితే, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

ప్రజానావ, సిరిసిల్ల : గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిద్దామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్, సెస్, మత్స్య, పోలీస్, రవాణా శాఖ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖ, తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ఏర్పాట్లపై చర్చించారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా కావాల్సిన క్రేన్స్, జేసీబీలు, విద్యుత్ దీపాలు, నీటి సదుపాయం కల్పించాలని ఆయా కమిషనర్లను ఆదేశించారు. స్టీల్ గ్లాస్ లతో నీటిని ఇవ్వాలని తెలిపారు. మండపాల వారీగా మున్సిపల్ సిబ్బందిని నియమించి పారిశుధ్య పనులు చేయించాలని సూచించారు.ప్రతి మండపం వద్ద డస్ట్ బిన్ ఏర్పాటు చేయించాలని తెలిపారు. ఎన్ పీడీసీఎల్ అధికారులు వినాయక మండపాలు, నిమజ్జనం రోజున విగ్రహాలు వెళ్లే దారిలో విద్యుత్ తీగలు ఎత్తు పెంచి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రాచారి, శ్రీనివాసులు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జీవించి సాధించాలి

- సైకాలజిస్ట్ పున్నంచందర్ పిలుపు
- ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కార్మికులకు గ్రూప్ కౌన్సెలింగ్



ప్రజానావ, సిరిసిల్ల : ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా నెహ్రూనగర్‌లోని కార్మికులకు గురువారం ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ ఆధ్వర్యంలో గ్రూప్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ పున్నంచందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని, సమస్యలు ఎదురైనప్పుడు వాటిని ఒంటరిగా భరించకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నిపుణులతో తమ ఆలోచనలు, భావాలను పంచుకోవాలని సూచించారు. ఆత్మహత్యల నివారణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచేందుకు "చేంజింగ్ ది నరేటివ్ ఆన్ సూసైడ్" అనే సందేశంతో ప్రజల్లో ఆత్మహత్యలపై ఉన్న ఆలోచనా విధానాన్ని మార్చాల్సిన అవసరం గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ విస్తృతంగా చర్చించాలని కోరిందన్నారు. సమస్యల్లో ఉన్న వ్యక్తులతో మనస్ఫూర్తిగా మాట్లాడటం, వారి బాధను వినడం, అర్థం చేసుకోవడం, అవసరమైన సమయంలో తగిన కౌన్సెలింగ్ మరియు మానసిక సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు మాట్లాడుతూ ఎటువంటి మానసిక లేదా కుటుంబ సమస్యలు ఎదురైనా వాటిని నిర్లక్ష్యం చేయకుండా మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ను సంప్రదించి అవసరమైన సహాయం పొందాలని కోరారు. ఆత్మహత్యల నివారణ కోసం మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు, మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ తదితరులు పాల్గొన్నారు.



## త్రీ ఫేజ్ కరెంట్ కోసం రైతుల ధర్నా

- వరి పంటలు ఎండిపోతున్నాయంటూ ఆగ్రహం
- సమస్య పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

ప్రజానావ, కామారెడ్డి : త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా సక్రమంగా అందడం లేదంటూ కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం పాల్వంచ మర్రి చౌరస్తా వద్ద పాల్వంచ, చుక్కాపూర్, వాడి, ఫరీద్‌పేట్, మంతన్‌దేవునిపల్లి గ్రామాలకు చెందిన రైతులు కామారెడ్డి–సిరిసిల్ల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. త్రీ ఫేజ్ కరెంట్ సక్రమంగా సరఫరా కాకపోవడంతో వరి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై పలుమార్లు ట్రాన్స్‌కో అధికారులు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ బోరుబావులకు నాణ్యమైన విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రైతులు హెచ్చరించారు.

## న్యూశాయంపేటలో పోచమ్మ బోనాల సందడి

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు.. వాడవాడలా ఘనంగా రథోత్సవం



ప్రజానావ, వరంగల్ : శ్రావణమాసం చివరి గురువారం సందర్భంగా న్యూశాయంపేటలో పోచమ్మ బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ఆనవాయితీ ప్రకారం గ్రామమంతా ఒకేరోజు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించింది. కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చిన భక్తులు 'పోచమ్మ తల్లీ సల్లంగ చూడు' అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. డప్పులు, వాయిద్యాల మోత, భక్తుల నినాదాలతో వీధులు మార్మోగగా.. పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డీజే పాటలు, పోలీసుల బందోబస్తు మధ్య పోచమ్మ తల్లి రథం వాడవాడలా ఘనంగా ఊరేగింది. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోచమ్మ బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించామని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డి, కుడా చైర్మన్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు, బీఆర్ఎస్ మాజీ డివిజన్ అధ్యక్షుడు వేల్పుల వేణుగోపాల్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

## కాంగ్రెస్ పాలనలో దివాలా దిశగా తెలంగాణ

మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్



ప్రజానావ, పెద్దపల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ తీవ్ర దివాళా దిశగా పయనిస్తోందని, తెలంగాణ ప్రయోజనాలను పక్కనపెట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాలకు గులాంగిరీ చేస్తోందని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం స్థానిక బి.ఆర్.ఎస్ జిల్లా కార్యాలయంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో అన్నీ సిద్ధంగా ఉన్నప్పటికీ కాళేశ్వరం, పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టుల మోటార్లను కావాలనే ఆన్ చేయడం లేదని మండిపడ్డారు. కాళేశ్వరంలో చిన్న పిల్లర్ రిపేర్ చేయిస్తే సరిపోయే దానికి, కేవలం కేసీఆర్ పై కక్ష సాధింపుతో ఉత్తర తెలంగాణ మొత్తాన్ని ఎండబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరంలో ఎలాంటి అవినీతి జరగలేదని కేంద్ర సంస్థల నివేదికలు కూడా స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. శ్రీశైలంలో డ్రింకింగ్ వాటర్ పేరు చెప్పి తెలంగాణకు నీళ్లు ఇవ్వకుండా, మరోవైపు పోతిరెడ్డిపాడు, వెలుగొండ టన్నెల్స్ ద్వారా రోజుకు 1–2 టీఎంసీల నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తుంటే ఈ ప్రభుత్వం కనీసం ప్రశ్నించకుండా చూస్తూ ఊరుకుంటోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ముఖం చెల్లకుండా కేసీఆర్ గారిపై అబాండాలు వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. విద్యార్థులు, నిరుద్యోగులు సభలు పెట్టుకుంటామంటే పర్మిషన్ ఇవ్వని ప్రభుత్వం, కేసీఆర్ గారి ఫామ్‌హౌస్‌పై దాడులు చేయడానికి ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన నాయకుడిని, కేసీఆర్ గారిని ముట్టుకుంటే తెలంగాణ మళ్లీ అగ్నిగుండం అవుతుందని, అలాంటి కుట్రలు చేస్తే ఎవ్వరూ మిగలరని హెచ్చరించారు. అలాగే జిల్లాల్లో భూ దాహంతో కోటి ఎకరాల భూములను 22 ఎ (నిషేధిత జాబితా) కింద పెట్టి రైతులను, ప్రజలను వేధిస్తున్నారని, ఎవ్వరూ భయపడి భూములను లేదా పర్సంటేజీలను నాయకులకు, అధికారులకు ఇవ్వవద్దని కోరారు. మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 22 ఎ నిబంధనలను, హైడ్రాని పూర్తిగా రద్దు చేసి పాతాళ గంగలో కలిపేస్తామని అభయమిచ్చారు.కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రాజకీయ నాయకుల మాటలు విని చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే రేపు జైలుపాలు కావాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. నిరుపేదల దగ్గర, అక్రమంగా సంపాదించిన ప్రతి రూపాయిని ఒంగబెట్టి కక్కిస్తామని, చట్టబద్ధంగా అధికారుల జాబితా తయారు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కేసీఆర్ కిట్, రైతుబీమా, రైతుబంధు లాంటి సంక్షేమ పథకాలను రద్దు చేసి, బిసి సబ్‌ప్లాన్, 42 శాతం రిజర్వేషన్లు, గొర్రెల పంపిణీ వంటి హామీలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విర్రవీగడం మానేసి, పరిపాలన, ఉద్యోగ రిక్రూట్‌మెంట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, సంక్షేమ హామీల నెరవేర్పుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. మేమంతా జైళ్లకు, కేసులకు భయపడకుండా గొంతు పట్టి తెలంగాణ తెచ్చుకున్నామని, అధికారం ఉందని ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తే ప్రజలే సరైన సమయంలో బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా బి.ఆర్.ఎస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజానావ, గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నాగంపేట గ్రామంలో కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై గురువారం డిజిటల్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బ్యాంకు ద్వారా పొందు రుణాలు, పీఎంఎస్బివై, పీఎంజెజెబివై ఇన్సూరెన్స్ పథకాలు, బ్యాంకు నందు డిపాజిట్లపై అవగాహన కల్పించారు, ప్రతి ఒక్కరూ సహకార బ్యాంకు సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దుల రాజిరెడ్డి, బ్యాంకు మేనేజర్ సురభి ప్రవీణ్ రావు, పిఎసిఎస్ డైరెక్టర్ మల్లారెడ్డి, సీఈవో రాజిరెడ్డి లతోపాటు బ్యాంక్ మరియు సొసైటీ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విధులకు దీర్ఘకాలంగా గైర్హాజరైన ఉద్యోగిపై చర్యలు

పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలోని కమాన్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.చిరంజీవి 2025 ఫిబ్రవరి 1 నుండి ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరవుతున్న నేపథ్యంలో, ఆయనపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం తెలిపారు. సంబంధిత ఉద్యోగి దీర్ఘకాలంగా విధులకు గైర్హాజరవుతున్న విషయాన్ని కమాన్‌పూర్ మండల తహసీల్దార్ 2026 ఏప్రిల్ 25న నివేదించారని తెలిపారు. అనధికారిక గైర్హాజరుపై వివరణ కోరుతూ జారీ చేసిన మెమోలను స్వీకరించేందుకు కె.చిరంజీవి నిరాకరించడంతో పాటు, ఫోన్ ద్వారా సంప్రదించేందుకు చేసిన ప్రయత్నాలకు కూడా స్పందించలేదని పేర్కొన్నారు. తదనంతరం 2026 మే 2న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా కె. చిరంజీవిని సర్వీసు నుండి సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. తెలంగాణ సివిల్ సర్వీసెస్ (క్లాసిఫికేషన్, కంట్రోల్ అండ్ అప్పీల్) రూల్స్, 1991లోని సంబంధిత నిబంధనల ప్రకారం కె. చిరంజీవిపై సర్వీసు నుండి తొలగింపు శిక్ష విధించేందుకు ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. ప్రతిపాదిత శిక్షను ఎందుకు విధించకూడదో, అందుకు గల సరైన, సముచితమైన కారణాలతో కూడిన లిఖితపూర్వక వివరణను షోకాజ్ నోటీసు అందుకున్న తేదీ నుండి 15 రోజుల్లోగా సమర్పించాలని సంబంధిత ఉద్యోగిని కోరినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నిర్ణీత గడువులోగా ఎటువంటి వివరణ సమర్పించని పక్షంలో, సంబంధిత ఉద్యోగికి సమర్పించేందుకు ఎటువంటి వివరణ లేదని భావించి, రికార్డులో అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని నిబంధనల ప్రకారం ప్రతిపాదిత శిక్షను విధించేందుకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు.

## మనోధైర్యంతో ముందుకు సాగాలి

- మానసిక ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడేవారు టోల్ ఫ్రీ నెంబర్ 14416, వైద్య సేవలు పొందాలి
- ఆత్మహత్యల నివారణ దినం పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజానావ, సిరిసిల్ల : మానసిక ఒత్తిడి, మానసిక సమస్యలతో బాధపడేవారు మనోధైర్యంతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణ దినం సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో టోల్ ఫ్రీ నెంబర్ 14416 పోస్టర్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఎంహెచ్ఓ ఏంజెలా ఆల్ఫ్రెడ్ తో కలిసి గురువారం ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ర్యాలీలు నిర్వహించి ఆత్మ హత్యల నివారణ గురించి అవగాహన కల్పించాలని, యువత, విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మానసిక సమస్యలకు చికిత్స తీసుకునే కంటే వీటిని దాచి పెట్టేందుకు చాలా మంది ప్రయత్నిస్తారని, ఈ సమస్యపై మాట్లాడేందుకు చాలా మంది ఇష్టపడరని వివరించారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో మానసిక కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, చికిత్స పూర్తిగా ఉచితముగా అందిస్తామని, వారి వివరాలు గోప్యముగా ఉంటాయని స్పష్టం చేశారు. ఆత్మహత్యలను అడ్డుకోవడంలో టెలీమానాస్ (టోల్ ఫ్రీ నెంబర్ 14416) 24X7 సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైద్యుల సూచన మేరకు సూచించిన మోతాదులో మందులు వాడితే ఆత్మ హత్యలు నివారించ బడుతాయని అన్నారు, సమాజం, చుట్టూ ప్రక్కల వారు ఆత్మ న్యూనత భావనతో ఉన్న వారికి చేయూత ఇవ్వాలని, అవగాహనతో మెలగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నయీమా జహా, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఫిలిప్పీన్స్‌లో ఘోర ఫెర్రీ ప్రమాదం

- మంటల్లో చిక్కుకున్న ప్యాసింజర్ ఫెర్రీ
- ఐదుగురు మృతి, 87 మంది గల్లంతు

**ఫిలిప్పీన్స్ :** ఫిలిప్పీన్స్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పలవాన్ ప్రావిన్స్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరన్‌కు వెళ్తున్న ఎంవీ జూన్ ఆస్టర్ ప్యాసింజర్ ఫెర్రీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, 87 మంది గల్లంతైనట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ప్రమాద సమయంలో ఫెర్రీలో మొత్తం 134 మంది ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 42 మందిని సురక్షితంగా రక్షించగా, వారిలో 38 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారు. మనీలా నుంచి కోరన్‌కు బయలుదేరిన ఫెర్రీ బరంగే మార్సిల్లా తీరానికి సుమారు 2.2 కిలోమీటర్ల దూరంలో ఉండగా మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే ఫిలిప్పీన్ కోస్ట్ గార్డ్ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. ఐదు మృతదేహాలను వెలికితీసి తీరానికి తరలించారు. గల్లంతైన 87 మంది కోసం భారీగా గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కోస్ట్ గార్డ్ కెప్టెన్ నోయెమీ కాయబ్యాబ్ తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షమైనట్లు వెల్లడించారు. ఫెర్రీలో మంటలు చెలరేగడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.

# కాగ్నిజెంట్‌కు అమెరికాలో భారీ షాక్!

- గ్రీన్‌కార్డ్ స్పాన్సర్‌షిప్ దరఖాస్తులపై నిషేధం
- వీసా మోసం ఆరోపణలపై దర్యాప్తు ముమ్మరం




**న్యూయార్క్ :** భారత మూలాలున్న ప్రముఖ టెక్ సంస్థ కాగ్నిజెంట్‌కు అమెరికాలో భారీ ఎదురుదెబ్బ తగిలింది. వీసా మోసం ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా కొత్తగా గ్రీన్‌కార్డ్ స్పాన్సర్‌షిప్ కోసం దరఖాస్తులు చేసుకోకుండా కాగ్నిజెంట్‌పై అమెరికా కార్మిక శాఖ నిషేధం విధించింది. ఈ విషయాన్ని డిపార్ట్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో ప్రకటించారు. కాగ్నిజెంట్‌తో పాటు క్లౌడెరాపైనా ఇదే తరహా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. తాజా నిర్ణయంతో కాగ్నిజెంట్ కొత్తగా పీఈఆర్‌ఎం (ప్రోగ్రామ్ ఎలక్ట్రానిక్ రివ్యూ మేనేజ్‌మెంట్) ఫైలింగ్స్ దాఖలు చేయడానికి వీలుండదు. అమెరికాలోని కంపెనీలు విదేశీ ఉద్యోగులకు శాశ్వత నివాస హోదా అయిన గ్రీన్‌కార్డ్ కోసం స్పాన్సర్ చేయాలంటే ముందుగా కార్మిక శాఖ నుంచి పీఈఆర్‌ఎం లేబర్ సర్టిఫికేషన్ పొందాల్సి ఉంటుంది. విదేశీ ఉద్యోగికి సంబంధించిన పోస్టుకు తగిన అర్హతలున్న అమెరికన్ కార్మికులు అందుబాటులో లేరని కంపెనీ నిరూపించడంతో పాటు, విదేశీ ఉద్యోగిని నియమించడం వల్ల స్థానిక కార్మికుల వేతనాలు, పని పరిస్థితులపై ప్రతికూల ప్రభావం ఉండదని స్పష్టం చేయాలి. ఇందుకోసం కార్మిక శాఖ నిర్దేశించిన వేతన నిబంధనలు పాటిస్తూ స్థానికంగా ఉద్యోగ ప్రకటనలు కూడా ఇవ్వాలి. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే గ్రీన్‌కార్డ్ స్పాన్సర్‌షిప్ ముందుకు సాగుతుంది. కాగా 1994లో చెన్నైలో ప్రారంభమైన కాగ్నిజెంట్ ప్రస్తుతం అమెరికాలో ప్రధాన కార్యాలయాన్ని కలిగి ఉండగా, హెచ్–1బీ వీసాలను అత్యధికంగా వినియోగించుకునే సంస్థల్లో ఒకటిగా ఉంది. 2026 ఆర్థిక సంవత్సరానికి కంపెనీకి 3,510 హెచ్–1బీ వీసా పిటిషన్లు ఆమోదం పొందినట్లు సమాచారం. అమెజాన్, టీసీఎస్, ఇన్ఫోసిస్, యాపిల్, మైక్రోసాఫ్ట్ తర్వాత కాగ్నిజెంట్ ఆరో స్థానంలో ఉన్నట్లు పేర్కొంటున్నారు. తాజా నిషేధం నేరుగా హెచ్–1బీ వీసాలపై ప్రభావం చూపనప్పటికీ.. గ్రీన్‌కార్డ్ ప్రక్రియకు కీలకమైన పీఈఆర్‌ఎం ఫైలింగ్స్ నిలిచిపోవడం కంపెనీపై ఆధారపడిన వేలాది మంది విదేశీ ఉద్యోగుల్లో, ముఖ్యంగా భారతీయ టెక్ నిపుణుల్లో ఆందోళనకు కారణమైంది. వీసా నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలోనే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. 'అమెరికన్ కార్మికులకు ఎదురయ్యే ముప్పును ఎంతమాత్రం సహించబోం' అని ఇన్‌స్పెక్టర్ జనరల్ డి'ఎస్పోసిటో హెచ్చరించారు. కొద్ది నెలల క్రితం కాగ్నిజెంట్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉందంటూ ఆయన 'ఎక్స్'లో పరోక్షంగా సూచించారు. కాగ్నిజెంట్ వంటి సంస్థలు వీసా నిబంధనలను దుర్వినియోగం చేస్తున్నాయంటూ విజిల్‌బ్లోయర్లు అందించిన సమాచారాన్ని పరిశీలి స్తున్నామని ఆయన గతంలో తెలిపారు. అమెరికా ప్రభుత్వం వీసా మోసాలపై కఠిన చర్యలకు సిద్ధమవు తున్న సమయంలో కాగ్నిజెంట్‌పై దర్యాప్తు, పీఈఆర్‌ఎం ఫైలింగ్స్‌పై నిషేధం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మాయావతి ఆదేశాలతో రాజకీయ సన్యాసం

### ఆకాశ్ ఆనంద్‌కు పార్టీలో మళ్లీ అవకాశం కోసం నిర్ణయం

**లక్నో :** బీఎస్పీ అధినేత్రి మాయావతి ఆదేశాలతో ఆ పార్టీ బహిష్కృత నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు అశోక్ సిద్ధార్థ్ రాజకీయ, సామాజిక జీవితానికి దూరమవుతున్నట్లు ప్రకటించారు. ఆకాశ్ ఆనంద్‌కు పార్టీలో మళ్లీ అవకాశం కల్పించాలంటే సిద్ధార్థ్ రాజకీయాల నుంచి వైదొలగాలని మాయావతి షరతు పెట్టిన మరుసటి రోజే ఈ ప్రకటన వెలువడటం ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. గురువారం సోషల్ మీడియాలో సుదీర్ఘ ప్రకటన చేసిన సిద్ధార్థ్.. తనపై వచ్చిన పార్టీ వ్యతిరేక కార్యకలాపాల ఆరోపణలను ఖండించారు. మాయావతిని తన రాజకీయ గురువు, అక్కగా పేర్కొంటూ.. ఆమె ఆదేశాలే తనకు అన్నింటికంటే ముఖ్యమని తెలిపారు. గత 35 ఏళ్లుగా బీఎస్పీ కోసం పనిచేస్తున్నానని, తనకు ఎమ్మెల్సీ, రాజ్యసభ సభ్యుడిగా అవకాశాలు కల్పించిన మాయావతికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఆకాశ్ ఆనంద్‌ను తప్పుదోవ పట్టించారని, పార్టీని తన ఆధీనంలోకి తీసుకునేందుకు ప్రయత్నించారని తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని స్పష్టం చేశారు.

## సిక్కులపై ట్రంప్ సర్కారు వివాదాస్పద పోస్టర్

- 'మిస్టర్ సింగ్.. మీకు డ్రైవింగ్ రాదు' అంటూ వ్యాఖ్యలు
- జాత్యహంకారమంటూ విమర్శలు




**న్యూయార్క్ :** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వలసదారులపై ట్రంప్ ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసిన వేళ.. సిక్కులను ఉద్దేశించి హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ చేసిన ఓ సోషల్ మీడియా పోస్టు వివాదానికి దారితీసింది. అక్రమంగా నివసిస్తున్న సిక్కులను దేశం విడిచి వెళ్లాలని సూచించేలా రూపొందించిన పోస్టర్‌ను ఆ శాఖ తన సోషల్ మీడియా ఖాతాలో ప్రచురించింది. పోస్టర్‌లో ట్రంప్ ముఖాన్ని పోలిన వ్యక్తికి ఎదురుగా ఓ సిక్కు వ్యక్తిని చూపిస్తూ.. 'మా రోడ్ల నుంచి వెళ్లిపోండి.. మీకు డ్రైవింగ్ చేయడం రాదు, మిస్టర్ సింగ్' అనే అర్థం వచ్చేలా వ్యాఖ్యలు ఉన్నాయి. ముఖ్యంగా 'సింగ్' అనే పేరును నేరుగా ప్రస్తావించడంతో ఈ పోస్టర్ ఇండో–అమెరికన్లలో, ముఖ్యంగా సిక్కు సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'యూ డోంట్ నో హౌ టు డ్రైవ్' అనే ట్యాగ్‌లైన్ ద్వారా అమెరికాలో ఇటీవల చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాలను సిక్కు డ్రైవర్లకు ఆపాదించే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ వలసదారులపై ఇమ్మిగ్రేషన్ శాఖ తీసుకుంటున్న చర్యలను సమర్థించుకునే క్రమంలోనే ఈ పోస్టర్‌ను రూపొందించినట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ.. ఓ నిర్దిష్ట మత, సామాజిక వర్గాన్ని అవమానించేలా, జాత్యహంకార ధోరణిలో ప్రచారం చేయడం సరికాదని విమర్శకులు మండిపడుతున్నారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడం వేరు, ఒక వర్గానికి చెందిన వ్యక్తులనే ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రచారం చేయడం వేరని సిక్కు సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ట్రంప్ ప్రభుత్వ ఇమ్మిగ్రేషన్ విధానాలతో పాటు హోంల్యాండ్ సెక్యూరిటీ శాఖ ప్రచురించిన ఈ పోస్టర్‌పై కూడా అమెరికాలో తీవ్ర చర్చ జరుగుతోంది.

## జోర్డాన్ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ దాడి

- అమెరికా యుద్ధ విమానాలకు భారీ నష్టం
- ఏ-10 విమానం రెక్క ధ్వంసం, 8 ఎఫ్–15లకు స్వల్ప నష్టం



**టెహ్రాన్ :** జోర్డాన్‌లోని మువాఫక్ సాల్తీ ఎయిర్‌బేస్‌పై ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో పలు అమెరికా యుద్ధ విమానాలు దెబ్బతిన్నట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. దాడిలో ఏ–10 థండర్ బోల్ట్ (వార్తాగ్) విమానం తీవ్రంగా దెబ్బతిని దాని ఒక రెక్క ధ్వంసమైనట్లు సమాచారం. మరోవైపు సుమారు ఎనిమిది ఎఫ్–15 యుద్ధ విమానాలకు స్వల్ప నష్టం వాటిల్లినట్లు సీఎన్‌బీసీ ఆధారంగా రాయిటర్స్ వెల్లడించింది. అయితే నష్టం జరిగినప్పటికీ ఆ ఎఫ్–15 విమానాలను తిరిగి సేవల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. ఇరాన్ నుంచి వచ్చిన దాడులను అడ్డుకునేందుకు జోర్డాన్‌లోని అమెరికా దళాలు సుమారు 30 పేట్రియాట్ క్షిపణులను ప్రయోగించినట్లు సమాచారం. అమెరికా ఐదు ఇరానీ చమురు ట్యాంకర్లను ధ్వంసం చేసిన ఘటనకు ప్రతీకారంగానే ఇరాన్ ఈ దాడులకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) జోర్డాన్‌లోని అమెరికా స్థావరంతో పాటు పలు నౌకలు, చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నట్లు ప్రకటించింది. మువాఫక్ సాల్తీ ఎయిర్‌బేస్ నుంచి అమెరికా కీలకమైన యుద్ధ విమానాలను నిర్వహిస్తోంది. ఈ దాడితో పశ్చిమాసియాలో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రతరమయ్యాయి.



### సౌదీపై హౌతీ దాడులు..

## పాక్ తీవ్ర హెచ్చరిక

- దాడులు ఆపకుంటే సౌదీకి అండగా రంగంలోకి దిగుతాం
- ఇరాన్ జోక్యం చేసుకోవాలని సూచన

**ఇస్లామాబాద్ :** సౌదీ అరేబియాపై యెమెన్‌కు చెందిన హౌతీ సంస్థ దాడులను పాకిస్తాన్ తీవ్రంగా ఖండించింది. దాడులు కొనసాగితే తమ మిత్రదేశమైన సౌదీకి మద్దతుగా తాము కూడా రంగంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించింది. ప్రస్తుతం ఇరాన్–అమెరికా మధ్య యుద్ధం తీవ్రతరమైన నేపథ్యంలో ఇరాన్‌కు మద్దతుగా హౌతీలు సౌదీ అరేబియాతో పాటు ఇతర గల్ఫ్ దేశాలపై దాడులు చేస్తున్నట్లు పాకిస్తాన్ పేర్కొంది. ఇటీవలే పాకిస్తాన్, టర్కీ, సౌదీ అరేబియా దేశాలు మక్కాలో రక్షణ, సైనిక సహకారానికి సంబంధించి కీలక ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కూటమిలోని ఏ ఒక్క దేశంపై దాడి జరిగినా.. అది మూడు దేశాలపై జరిగిన దాడిగానే పరిగణించి, పరస్పరం అండగా నిలవాలని నిర్ణయించుకున్నాయి. ఈ నేపథ్యంలో సౌదీపై హౌతీల దాడులను పాకిస్తాన్ తీవ్రంగా పరిగణిస్తోంది. దాడులను తక్షణమే నిలిపివేయాలని హౌతీలను హెచ్చరించిన పాక్.. లేకుంటే సౌదీకి మద్దతుగా తమ కూటమి రంగంలోకి దిగుతుందని స్పష్టం చేసింది. అదే సమయంలో హౌతీలపై తమ ప్రభావాన్ని ఉపయోగించి సౌదీపై దాడులను నిలిపివేయాల్సిన బాధ్యత ఇరాన్‌పైనే ఉందని పాకిస్తాన్ పేర్కొంది. ఇందుకోసం ఇరాన్ తన అధికారాన్ని, దౌత్య మార్గాలను వినియోగించాలని సూచించింది. హౌతీల దాడులు ఆగకపోతే పాకిస్తాన్, టర్కీ, సౌదీ కలిసి చర్యలు తీసుకుంటాయనే విషయం లో ఎలాంటి సందేహాలు అవసరం లేదని పాక్ తేల్చి చెప్పింది. ఇదిలా ఉండగా.. సౌదీపై హౌతీలు జరిపిన దాడుల్లో 73 మంది గాయపడినట్లు సమాచారం. మరోవైపు హౌతీల స్థావరాలున్న యెమెన్‌పై సౌదీ అరేబియా కూడా దాడులు కొనసాగిస్తోంది.

## ముంబై-గోవా హైవేపై గడ్కరీ ఫైర్

- ప్రారంభోత్సవానికి నేను రాను' అంటూ కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు

**పనాజీ :** ముంబై–గోవా హైవే విస్తరణ పనులు నత్తనడకన సాగడంపై కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల ఆలస్యంపై తాను సిగ్గుపడుతున్నానని, అందుకే ఈ రహదారి పూర్తయిన తర్వాత జరిగే ప్రారంభోత్సవానికి తాను హాజరుకాబోనని స్పష్టం చేశారు. గోవా రాజధాని పనాజీ సమీపంలోని పోర్వోరిమ్ వద్ద నిర్మించిన ఆరు లేన్ల ఎలివేటెడ్ రోడ్ కారిడార్‌ను గురువారం గడ్కరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి శ్రీపాద నాయక్, రాష్ట్ర ప్రజా పనుల శాఖ మంత్రి దిగంబర్ కామత్, పర్యాటక శాఖ మంత్రి రోహన్ ఖౌంటే తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన గడ్కరీ.. ముంబై–గోవా హైవే పనులు ఇంతగా ఆలస్యం కావడం తనకు సిగ్గుగా అనిపించిందని వ్యాఖ్యానించారు. అందుకే ఆ హైవే ప్రారంభోత్సవానికి తాను రాబోనని ముందుగానే ప్రకటిస్తున్నానని అన్నారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో జాప్యం, నాసిరకం పనులకు బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై ఇకపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడాది వ్యవధిలో అత్యధిక సంఖ్యలో కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ చేసి, బాధ్యులైన అధికారులను సస్పెండ్ చేసి రికార్డు సృష్టించాలనుకుంటున్నానని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఇక వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.

# ప్రముఖులకు ఓటరు నోటీసులు

- నందన్ నిలేకనీ, కామత్ సోదరులతో పాటు సీఎం తల్లి పేర్లలోనూ మిస్‌మ్యాచ్
- ఇంటికే వెళ్లి వివరాల సేకరణ



**బెంగళూరు :** కర్ణాటకలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం కొనసాగుతున్న నేపథ్యంలో ఓటరు జాబితాలో వివరాలు సరిగా లేని పలువురు ప్రముఖులకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా ఇన్ఫోసిస్ ఫౌండర్ నందన్ నిలేకనీ, ఆయన కుటుంబ సభ్యులతో పాటు జిరోధా వ్యవస్థాపకులు నితిన్ కామత్, నిఖిల్ కామత్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తల్లి గౌరమ్మలకు కూడా నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. కనకపుర అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటు హక్కు కలిగిన గౌరమ్మ పేరుకు సంబంధించిన వివరాల్లో మిస్‌మ్యాచ్‌ను ఎన్నికల అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అలాగే నిలేకనీ కుటుంబంలోని ఆయన భార్య, పిల్లలకు 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగలేదనే అంశం కూడా గుర్తించినట్లు సమాచారం. నితిన్ కామత్, నిఖిల్ కామత్, వారి తల్లి రేవతి కామత్ పేర్లకు బెంగళూరు సౌత్ అసెంబ్లీ నియోజకవర్గంలో పేరెంట్స్ పేర్లకు సంబంధించిన వివరాల్లో మిస్‌మ్యాచ్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అయితే ప్రముఖులు, వీఐపీలను సాధారణ వెరిఫికేషన్ ప్రక్రియ పేరుతో ఇబ్బందులకు గురిచేయబోమని అధికారులు స్పష్టం చేశారు. వారి ఇళ్లకు సిబ్బందిని పంపించి అవసరమైన వివరాలను సేకరించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నోటీసులు జనరేట్ చేసినప్పటికీ.. వాటిని సంబంధిత వ్యక్తులకు అధికారులు ఇంకా అధికారికంగా పంపలేదని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. పేరు వివరాల్లో తప్పు దానికి సంబంధించి భారతరత్న గ్రహీత, ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సీఎన్‌ఆర్ రావు పేరుతోనూ నోటీసు జనరేట్ చేసినట్లు సమాచారం. కన్నడ సినీ నటుడు శివరాజ్‌కుమార్ పేరుకు 2002 ఓటరు జాబితాతో మ్యాపింగ్ జరగలేదనే అంశంపై కూడా నోటీసు జనరేట్ చేశారు. అయితే వీటిలోని సమస్యలను అధికారిక స్థాయిలోనే పరిష్కరిస్తున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

## రిపబ్లికన్లు గెలిస్తే.. ప్రతి అమెరికన్‌కు రూ.4 లక్షలు

- 'ట్రంప్ డివిడెండ్' పేరుతో నగదు పంపిణీకి హామీ
- అమలుకు రూ.83 లక్షల కోట్లకుపైగా అవసరం

**అమెరికా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ ఇచ్చారు. నవంబర్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ప్రతినిధుల సభ, సెనేట్‌పై పట్టు నిలబెట్టుకుంటే ప్రతి వయోజన అమెరికన్‌కు 5,000 డాలర్లు (సుమారు రూ.4 లక్షలు) అందజేస్తామని ప్రకటించారు. ఈ మొత్తాన్ని 'ట్రంప్ డివిడెండ్'గా పిలుస్తామని తెలి పారు. డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ సమావే శంలో మాట్లాడిన ట్రంప్.. ఎన్నికల్లో తాను పోటీ చేయకపోయినా తనను బ్యాలెట్‌పై ఉన్నట్టుగా భావించి రిపబ్లికన్ అభ్యర్థులకు ఓటేయాలని మద్ద తుదారులను కోరారు. 'రిపబ్లికన్లు గెలిస్తే.. మీరూ గెలిచినట్లే. మీకు 5,000 డాలర్లు వస్తాయి' అని వ్యాఖ్యానించారు. ఈ పథకాన్ని అమలు చేయా లంటే కనీసం ఒక ట్రిలియన్ డాలర్లు అవసరమయ్యే అవకాశం ఉన్నప్పటికీ, అంత భారీ మొత్తాన్ని ఎక్కడి నుంచి సమకూర్చుతారనే విషయాన్ని ట్రంప్ స్పష్టం చేయలేదు. 'మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది' అని మాత్రమే పేర్కొన్నారు. అయితే ఆర్థికం గా, రాజకీయంగా ఈ ప్రతిపాదనను అమలు చేయ డం అంత సులభం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. మరోవైపు ధరల పెరుగుదల, ఇరాన్ పై అమెరికా చేపట్టిన యుద్ధం వంటి అంశాలపై ఓటర్లలో అసంతృప్తి పెరుగుతున్నట్లు తాజా సర్వేలు సూచిస్తున్నాయి.



### నిర్మాణంలో ఉన్న వంతెన కూలి..

## 8 మంది కార్మికులకు గాయాలు

- బీమ్ లాంచర్, కాంక్రీట్ స్లాబ్ కుప్పకూలడంతో ప్రమాదం
- ఇద్దరి పరిస్థితి విషమం

**బిహార్ :** బిహార్‌లో నిర్మాణంలో ఉన్న వంతెన ఒక్కసారిగా కూలిపోవడంతో ఎనిమిది మంది కార్మికులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన వైశాలి జిల్లాలోని లాల్‌గంజ్ ప్రాంతంలో గురువారం చోటుచేసుకుంది. భారత్‌మాలా పథకం కింద నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో ఎన్‌హెచ్–139డబ్ల్యూ పరిధిలో నాలుగు లేన్ల రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా నిర్మిస్తున్న వంతెనపై బీమ్ లాంచర్, కాంక్రీట్ స్లాబ్ ఒక్కసారిగా కుప్పకూలడంతో అక్కడ పనిచేస్తున్న ఎనిమిది మంది కార్మికులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే తోటి కార్మికులు క్షతగాత్రులను లాల్‌గంజ్ రిఫరల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో ఆరుగురికి అక్కడే చికిత్స అందిస్తున్నారు. వారి పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం ఉన్నత వైద్యశాలలకు తరలించారు. ప్రమాద సమయంలో ఓ కార్మికుడు వంతెనకు సంబంధించిన ఇనుప రాడ్ల మధ్య చిక్కుకుపోయాడు. అతడిని బయటకు తీసేందుకు రాడ్లను కట్ చేసి, అనంతరం ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో సహాయక చర్యలను జిల్లా మెజిస్ట్రేట్ వర్షా సింగ్ పర్యవేక్షిస్తున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు. నిర్మాణ ప్రాంతంలో భద్రతా ప్రమాణాలు పాటించారా? లేదా? అనే అంశంపైనా ఆరా తీస్తున్నారు. అయితే ఈ ప్రమాదంలో నిర్మాణంలో ఉన్న వంతెనకు ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు వెల్లడించారు.

# బ్రిక్స్ సదస్సుకు ఢిల్లీ ముస్తాబు

- పుతిన్, జిన్‌పింగ్, పెజెష్కియాన్ రాక
- 7 వేల మంది భద్రతా సిబ్బంది మోహరింపు



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీ 18వ బ్రిక్స్ సదస్సుకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ మండపంలో జరగనున్న ఈ అంతర్జాతీయ సదస్సుకు సెప్టెంబర్ 11 నుంచే విదేశీ అతిథులు తరలిరానున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో జరిగే ఈ సమావేశానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా తదితర ప్రముఖ నేతలు హాజరుకానున్నారు. మొత్తం 11 దేశాలకు చెందిన ప్రతినిధులు సదస్సులో పాల్గొననున్న నేపథ్యంలో ఢిల్లీలో అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సదస్సు జరిగే భారత్ మండపంతోపాటు విదేశీ అతిథులు బస చేసే హోటళ్ల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. నగరవ్యాప్తంగా దాదాపు 500 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటి పర్యవేక్షణకు తుగ్లక్ రోడ్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఢిల్లీ పోలీసులతోపాటు పారామిలిటరీ బలగాలు, ఎన్‌ఎస్‌జీ, ఐబీ, ఇతర భద్రతా విభాగాలకు చెందిన సుమారు 7 వేల మంది సిబ్బందిని విధుల్లోకి దించారు. మరోవైపు అంతర్జాతీయ అతిథులకు స్వాగతం పలికేందుకు ఢిల్లీ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో సుందరీకరణ పనులు చేపట్టి 15 వేలకుపైగా పూల మొక్కలను ఏర్పాటు చేశారు. బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, భద్రత, పరస్పర సహకారం, రవాణా, సరఫరా వ్యవస్థలు, సాంకేతికత తదితర కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. బ్రెజిల్, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ తదితర దేశాల ప్రతినిధులు కూడా సమావేశానికి హాజరుకానున్నారు. భారత్ బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వడం ఇది నాలుగోసారి. గతంలో 2012, 2016, 2021లో భారత్‌లో బ్రిక్స్ సదస్సులు జరిగాయి.



## అగార్కర్‌కు రోహిత్ సైలెంట్ కౌంటర్!

- టీషర్ట్‌పై 'కమిట్‌మెంట్ లేదా?' అంటూ ఆసక్తికర సందేశం
- గతంలో రోహిత్, కోహ్లి కమిట్‌మెంట్‌పై అగార్కర్ వ్యాఖ్యలు
- ఇప్పుడు హిట్‌మ్యాన్ పంచ్.. సోషల్ మీడియాలో వైరల్

**ముంబయి:** భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మైదానంలోనే కాదు.. బయట కూడా తనదైన శైలిలో సందడి చేస్తుంటాడు. తోటి ఆటగాళ్లు, స్నేహితులతో సరదాగా గడుపుతూ అప్పుడప్పుడు వేసే పంచ్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతుంటాయి. తాజాగా రోహిత్ శర్మకు సంబంధించిన ఓ ఫొటో నెట్టింట చర్చనీయాంశంగా మారింది. టీమిండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌ను ఉద్దేశించే రోహిత్ ఈ విధంగా కౌంటర్ ఇచ్చాడని అభిమానులు చర్చించుకుంటున్నారు.

### టీషర్ట్‌తోనే సందేశం?

'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే ఎంటర్‌టైన్‌మెంట్ షోతో హిట్‌మ్యాన్ తొలిసారి హోస్ట్‌గా కొత్త అవతారం ఎత్తబోతున్నాడు. సెప్టెంబరు 19 నుంచి ఈ కార్యక్రమం ప్రసారం కానుంది. ఈ షోకు సంబంధించిన ప్రోమో షూటింగ్‌లో రోహిత్ ధరించిన టీషర్ట్ ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా మారింది. రోహిత్ ధరించిన తెల్లటి టీషర్ట్‌పై 'Non–committal?' (కమిట్‌మెంట్ లేదా?) అనే పదాలు కనిపించాయి. రోహిత్ నేరుగా ఎవరినీ ప్రస్తావించకపోయినా.. ఈ సందేశం అగార్కర్ గతంలో చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా ఉందని నెటిజన్లు భావిస్తున్నారు.

### అసలు వివాదం ఏంటి?

గతేడాది అక్టోబరులో శుభ్‌మన్ గిల్‌ను వన్డే కెప్టెన్‌గా ఎంపిక చేసిన సమయంలో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడే విషయంలో 'కమిట్‌మెంట్‌'తో లేరని అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించాడు. ఆ వ్యాఖ్యలు అప్పట్లో క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. అయితే ఫిబ్రవరిలో రోహిత్ శర్మ దీనిపై స్పందిస్తూ.. దేశం తరఫున ఆడటం, ట్రోఫీలు గెలవాలనే తపన, ఆకలి తమలో పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశాడు. ఇప్పుడు అగార్కర్ గతంలో ఉపయోగించిన 'Non–committal' అనే పదాన్నే రోహిత్ తన టీషర్ట్‌పై ధరించడం ఆసక్తికరంగా మారింది. రోహిత్ నేరుగా ఎలాంటి వ్యాఖ్య చేయకపోయినా.. ఈ టీషర్ట్ సందేశం మాత్రం అభిమానుల్లో కొత్త చర్చకు తెరతీసింది. ఇది యాదృచ్ఛికమా? లేక అగార్కర్‌కు ఉద్దేశపూర్వకంగానే ఇచ్చిన సైలెంట్ కౌంటరా? అంటూ నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు.

## అఫ్గాన్ సిరీస్‌కు టీమిండియా కసరత్తు

- గాయం నుంచి కోలుకున్న వాషింగ్టన్ సుందర్ ముమ్మర సాధన
- నేడు జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేయనున్న బుమ్రా, నితీశ్
- కీలక ఆటగాళ్ల వరుస గాయాలపై బీసీసీఐ ఆందోళన
- ఫిజియో కమలేశ్ జైన్‌పై వేటుకు రంగం సిద్ధం?



**న్యూఢిల్లీ:** అఫ్గానిస్థాన్‌తో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నద్ధమవుతోంది. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న వాషింగ్టన్ సుందర్ గురువారం నెట్ సెషన్‌లో తీవ్రంగా శ్రమించాడు. రిటర్న్–టు–ప్లే ప్రక్రియను పూర్తి చేసిన జస్ప్రీత్ బుమ్రా, నితీశ్ రెడ్డి శుక్రవారం జట్టుతో కలిసి సాధన చేయనున్నారు. ఢిల్లీ ఎండ తీవ్రతలో గురువారం 10 మంది ఆటగాళ్లు మాత్రమే సాధనకు హాజరయ్యారు. దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ చెన్నైలో మ్యాచ్ ఆడుతుండటంతో మిగిలిన ఆటగాళ్లే ప్రాక్టీస్ చేశారు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే పర్యవేక్షణలో వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి సింగిల్ వికెట్ డ్రిల్స్‌లో ఎక్కువసేపు బౌలింగ్ చేశారు. హర్షిత్ రాణా స్థానంలో ఎంపికైన యశ్ ఠాకూర్ కూడా స్పాట్ బౌలింగ్ సాధన చేశాడు.
అక్షర్, బిష్ణోయ్‌ల బౌలింగ్‌లో సంజూ, అభిషేక్ ఫిరోజ్‌షా కోట్లా 'బి' నెట్స్‌లో సంజూ శాంసన్, అభిషేక్ శర్మ.. అక్షర్ పటేల్, రవి బిష్ణోయ్‌ల బౌలింగ్‌ను ఎదుర్కొన్నారు. 45 నిమిషాల సెషన్‌లో అభిషేక్ శర్మ మెరుగ్గా కనిపించగా, స్పిన్నర్లతోపాటు ఢిల్లీ ఆఫ్ స్పిన్నర్ హృతిక్ షోకీన్‌ను కూడా ధాటిగా ఎదుర్కొన్నాడు. వాషింగ్టన్ సుందర్ నియంత్రణతో బౌలింగ్ చేసినప్పటికీ నెట్ బౌలర్లను ఎదుర్కొంటూ కొంత తడబడ్డాడు. అతడి షాట్లలో గతంలో కనిపించిన టైమింగ్, సాఫీదనం పూర్తిస్థాయిలో కనిపించ లేదు. టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నె మోర్కెల్ గురువారం సాధనకు హాజరు కాలేదు. శ్రీలంక నుంచి దక్షిణాఫ్రికాకు వెళ్లిన ఆయన వర్క్ వీసా గడువు ముగియడంతో పునరుద్ధరణ కోసం స్వదేశానికి వెళ్లినట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. మరికొద్ది రోజుల్లో ఆయన తిరిగి జట్టుతో చేరే అవకాశం ఉంది.

### ఫిజియోపై వేటు?

గత ఆరు నుంచి ఎనిమిది నెలల్లో కీలక ఆటగాళ్లు వరుసగా గాయపడటంతో జట్టు ప్రణాళికలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో సీనియర్ ఫిజియో కమలేశ్ జైన్‌ను తప్పించేందుకు బీసీసీఐ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన నోటీసు పీరియడ్‌లో ఉన్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఆసియా క్రీడల బృందమే అఫ్గాన్ సిరీస్‌లో ఆడుతున్నందున ఫిజియో, స్ట్రెంగ్త్ అండ్ కండిషనింగ్ కోచ్‌లు జట్టుతో కలిసి జపాన్‌కు వెళ్లాల్సి ఉంది. కీలక ఆటగాళ్ల తరచూ గాయాలపై సెలెక్టర్లు, గంభీర్ ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో బీసీసీఐ స్పోర్ట్స్ సైన్స్ విభాగంలో మార్పులు చేయనున్నట్లు తెలుస్తోంది.

## ఆసియా కప్ ఫైనల్‌లో భారత్



**దుబాయ్:** మహిళల టీ20 ఆసియాకప్ టైటిల్‌కు భారత్ అడుగు దూరంలో నిలిచింది. గురువారం జరిగిన సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ బృందం 40 పరుగుల తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. ఓపెనర్ షెఫాలి వర్మ (64; 40 బంతుల్లో 7×4, 3×6) చెలరేగడంతో మొదట భారత్ 6 వికెట్లకు 149 పరుగులు చేసింది. ఛేదనలో బంగ్లాదేశ్ తడబడింది. 7 వికెట్లకు 109 పరుగులే చేయగలిగింది. షోర్నా అక్తర్ (22 నాటౌట్) టాప్ స్కోరర్. స్పిన్నర్లు దీప్తి శర్మ (3/26), శ్రీచరణి (1/14), ప్రేమ రావత్ (1/21) ఆ జట్టుకు కళ్లెం వేశారు. పాక్, శ్రీలంక మధ్య సెమీఫైనల్ విజేతతో భారత్ ఆదివారం ఫైనల్లో తలపడుతుంది.

### తేలిపోయిన బంగ్లా

ఛేదనలో బంగ్లాదేశ్ పరుగుల కోసం కష్టపడింది. స్పిన్నర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఇన్నింగ్స్ ఏ దశలోనూ ఊపందుకోలేదు. బంగ్లా 8 ఓవర్లలో 35కే రెండు వికెట్లు కోల్పోయింది. శ్రీచరణి తన తొలి రెండు ఓవర్లలో 4 పరుగులే ఇచ్చి ఓ వికెట్ పడగొట్టింది. క్రీజులో నిలిచిన శోభన (18), నిగర్ (19) జంట మూడో వికెట్‌ను త్వరగా పడనివ్వలేదు. కానీ పరుగుల వేటలో మాత్రం వెనుకబడిపోయింది. బంగ్లా సాధించాల్సిన రన్‌రేట్ బాగా పెరిగిపోయింది. 13 ఓవర్లకు ఆ జట్టు స్కోరు 65/2. తర్వాతి ఓవర్లోనే శోభనను దీప్తి ఔట్ చేసింది. అక్కడి నుంచి బంగ్లా మరింత వేగంగా ఓటమి దిశగా సాగింది. నిగర్‌ను ప్రేమ, షర్మిన్ (1)ను దీప్తి ఔట్ చేయడంతో 16 ఓవర్లలో 84/5తో బంగ్లాదేశ్ పరాజయం ఖాయమైపోయింది. బంగ్లా మిగతా ఆట కేవలం ఓటమి అంతరాన్ని తగ్గించడానికే. శ్రీచరణి టీ20ల్లో 50 వికెట్ల మైలురాయి చేరుకుంది. షెఫాలి మెరుపులతో భారత్ మొదట గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. బంగ్లా బౌలర్లు హర్మన్ బృందాన్ని కట్టడి చేయగలిగారనే చెప్పాలి. అయితే షెఫాలి మెరుపులకు తోడు ఆఖర్లో రిచా, దీప్తి బ్యాట్ ఝుళిపించడంతో భారత్ కాస్త సంతృప్తిగా ఇన్నింగ్స్‌ను ముగించగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. రెండో ఓవర్లోనే స్మృతి (2) వికెట్‌ను కోల్పోయింది. అయితే మరో ఓపెనర్ షెఫాలి మాత్రం బ్యాట్ ఝుళిపించింది. మారుఫా వేరు వేరు ఓవర్లలో రెండు ఫోర్లు కొట్టిన ఆమె.. సుల్తానా బౌలింగ్‌లో వరుసగా రెండు సిక్స్‌లు కొట్టింది. ప్రతీక రావల్ (20; 24 బంతుల్లో 1×4, 1×6) ఆమెకు తోడుగా నిలిచినా.. ధాటిగా ఆడలేకపోవడంతో స్కోరు బోర్డు వేగంగా కదల్లేదు. 10వ ఓవర్లో ప్రతీక ఔటయ్యే సమయానికి భారత్ స్కోరు 59 పరుగులే. షెఫాలి చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించినా.. ప్రతీక స్థానంలో వచ్చిన హర్మన్‌ప్రీత్ కౌర్ (24 నాటౌట్; 28 బంతుల్లో 2×6) కూడా ధాటిగా ఆడలేకపోయింది.
పరుగుల కోసం చెమటోడ్చింది. హర్మన్‌ప్రీత్ ఎదుర్కొన్న తొలి 14 బంతుల్లో 3 పరుగులే చేసి, స్కోరు వేగం తగ్గిపోవడానికి కారణమైంది. 13 ఓవర్లలో 78/2తో నిలిచింది భారత్. అప్పటికే 35 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసిన షెఫాలి.. 14వ ఓవర్లో వరుసగా 6, 4, 4 కొట్టి ఔటైంది. బంగ్లా ఫీల్డర్లు క్యాచ్‌లు వదిలేయడంతో అంతకుముందు ఆమె మూడుసార్లు ఔటయ్యే ప్రమదాన్ని తప్పించుకుంది. షెఫాలి నిష్క్రమణ తర్వాత కూడా హర్మన్‌ప్రీత్ అవస్థ కొనసాగగా.. రబేయా ఓవర్లో రిచా ఘోష్ (21; 16 బంతుల్లో 2×6) సిక్స్ కొట్టింది. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ ఎట్టకేలకు ఓ సిక్స్ దంచింది. 17 ఓవర్లకు భారత్ స్కోరు 116/3. తర్వాతి ఓవర్లో ఓ సిక్స్ కొట్టిన రిచా.. 19వ ఓవర్లో నిష్క్రమించింది. దీప్తి శర్మ (13) ఆఖరి ఓవర్లో ఓ ఫోర్, సిక్స్ కొట్టి ఔటైంది. బంగ్లా స్పిన్నర్లు చాలా పొదుపుగా బౌలింగ్ చేయగా.. పేసర్లు ఎక్కువగా పరుగులిచ్చారు.

## ఈస్ట్ జోన్‌దే దులీప్ ట్రోఫీ

- డ్రాగా ముగిసిన ఫైనల్.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ కైవసం
- ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీతో అదరగొట్టిన ఈస్ట్ జోన్
- మైదానంలో డ్యాన్స్ చేసిన ఇషాన్, వైభవ్ సూర్యవంశీ



**చెన్నై:** దులీప్ ట్రోఫీ–2026ను ఈస్ట్ జోన్ సొంతం చేసుకుంది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా సౌత్ జోన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ.. తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. దీంతో 13 ఏళ్ల తర్వాత ఆ జట్టు దులీప్ ట్రోఫీని మళ్లీ ముద్దాడింది. తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 270 పరుగులతో జట్టుకు భారీ స్కోరు అందించాడు. కుమార్ కుశాగ్ర 101 పరుగులతో రాణించాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌటవ్వడంతో ఆతొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

### రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆధిపత్యం

ఫాలోఆన్ ఇవ్వకుండా ఈస్ట్ జోన్ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. ఐదో రోజు ఆటను 212/5తో ప్రారంభించిన ఈస్ట్ జోన్.. అనంతరం 388/7 వద్ద డిక్లేర్ చేసింది. కౌనైన్ ఖురేషి అజేయ శతకంతో మెరిశాడు. 26 పరుగులతో ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అతడు సెంచరీ పూర్తి చేసి 116 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మ్యాచ్‌లో ఫలితం వచ్చే అవకాశం లేకపోవడంతో అంపైర్లు డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఈస్ట్ జోన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. కెప్టెన్ ఇషాన్ కిషన్, యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ కలిసి డ్యాన్స్ చేస్తూ విజయాన్ని ఆస్వాదించారు.

## ఇంగ్లండ్‌కు భారీ ఆధిక్యం

- తొలి ఇన్నింగ్స్‌లో 453 పరుగులకు ఆలౌట్
- 320 పరుగుల ఆధిక్యం.. స్మిత్, రాబిన్సన్ అర్ధ శతకాలు
- రజావుల్లాకు నాలుగు వికెట్లు



**బర్మింగ్‌హామ్:** పాకిస్థాన్‌తో జరుగుతున్న ఎడ్జ్‌బాస్టన్ టెస్టులో ఇంగ్లండ్ పట్టు బిగించింది. రెండో రోజు గురువారం టీ విరామ సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 453 పరుగులకు ఆలౌటైన ఇంగ్లండ్.. పాక్‌పై ఏకంగా 320 పరుగుల ఆధిక్యం సాధించింది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇప్పటివరకు పాకిస్థాన్ ఒక్కసారి కూడా 200 పరుగుల మార్క్‌ను దాటకపోవడంతో.. ఇంగ్లండ్ ఆధిక్యం భారీగా కనిపిస్తోంది. మధ్యాహ్న భోజన విరామం తర్వాత పెరుగుతున్న మేఘావృత వాతావరణంలో జేమీ స్మిత్, ఒల్లీ రాబిన్సన్ అర్ధ శతకాలతో చెలరేగారు.
స్మిత్ 84 బంతుల్లో 69 పరుగులు చేసి అరంగేట్ర పేసర్ రజావుల్లా బౌలింగ్‌లో క్యాచ్ అండ్ బౌల్డ్‌గా వెనుదిరిగాడు. రాబిన్సన్ 47 బంతుల్లో ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 50 పరుగులు చేశాడు. ఇది అతడికి రెండో టెస్టు అర్ధ శతకం.

### 25 ఓవర్లలో 154 పరుగులు

ఇంగ్లండ్ బ్యాటర్లు పాక్ బౌలర్లపై విరుచుకుపడి 25 ఓవర్లలోనే 154 పరుగులు సాధించారు. చివరి వరుస బ్యాటర్లు కూడా 116 పరుగులు జోడించి 15 బౌండరీలు బాదారు. జోఫ్రా ఆర్చర్ 32 పరుగులతో నాటౌట్‌గా మిగిలాడు. పాకిస్థాన్ బౌలర్లలో అరంగేట్ర పేసర్ రజావుల్లా నాలుగు వికెట్లు పడగొట్టాడు. అయితే అతడే అత్యధిక పరుగులు సమర్పించుకున్న బౌలర్‌గా నిలిచాడు. మహ్మద్ అలీ, అరంగేట్ర ఆటగాడు మహ్మద్ ఇమ్రాన్ చెరో రెండు వికెట్లు తీశారు. బుధవారం తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 133 పరుగులకే ఆలౌటైంది. దీంతో టీ విరామం తర్వాత పాక్ బ్యాటింగ్‌కు దిగి భారీ లోటును పూడ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



Business
బిజినెస్






## బ్యాంకులకు సమ్మె సెగ!

- ఐదు రోజుల పనివారంతో పాటు పెండింగ్ డిమాండ్లపై నేడు దేశవ్యాప్త సమ్మె
- ఆ తర్వాత వరుస సెలవులతో నాలుగు రోజుల పాటు సేవలకు అంతరాయం
- సెప్టెంబర్ 28 నుంచి మరో మూడు రోజుల సమ్మెకు యూఎఫ్‌బీయూ హెచ్చరిక
- పెన్షన్ నవీకరణ, ఏకరీతి డీఏ, ఓపీఎస్ అమలుకూ ఉద్యోగ సంఘాల డిమాండ్

**న్యూఢిల్లీ:** ఐదు రోజుల పనివారంతోపాటు ఇతర పెండింగ్ డిమాండ్ల సాధన కోసం బ్యాంకు ఉద్యోగ, అధికారుల సంఘాలు శుక్రవారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. దీంతో ముఖ్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నగదు ఉపసంహరణ, డిపాజిట్లు, ఇతర బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. సెప్టెంబర్ 11న శుక్రవారం సమ్మె జరగనుండగా.. ఆ తర్వాత రెండు రోజులు సెలవులు కావడంతో పలు ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలపై వరుసగా నాలుగు రోజులపాటు ప్రభావం పడే అవకాశం ఉంది. సెప్టెంబర్ 14న కొన్ని రాష్ట్రాల్లో గణేశ్ చతుర్థి సెలవు కూడా ఉండనుంది. సమ్మె నేపథ్యంలో బ్యాంకింగ్ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఖాతాదారులను అప్రమత్తం చేశాయి. శాఖలు, కార్యాలయాల సాధారణ కార్యకలాపాలు కొనసాగించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినప్పటికీ.. సమ్మె కారణంగా సేవలపై ప్రభావం ఉండొచ్చని ఎస్‌బీఐ సూచించింది. ఏడు బ్యాంకు ఉద్యోగ, అధికారుల సంఘాలతో కూడిన యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) మరో మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెకు హెచ్చరించింది. సెప్టెంబర్ 28 నుంచి ఈ సమ్మె చేపట్టనున్నట్లు తెలిపింది. బ్యాంకుల అర్ధ సంవత్సర ముగింపు సమయంలో ఈ సమ్మె జరగనుండటం గమనార్హం.

### పెన్షన్ డిమాండ్లపైనా పట్టు

ఐదు రోజుల పనివారం అమలు చేయాలన్న డిమాండ్‌ను చాలాకాలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నా స్పష్టమైన హామీ లభించలేదని బ్యాంకు సంఘాలు పేర్కొన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌బీఐ, ఎల్ఐసీ, జీఐసీ, నాబార్డ్ తదితర సంస్థల్లో ఇప్పటికే ఐదు రోజుల పనివారం అమలవుతోందని గుర్తుచేశాయి. పెన్షన్ నవీకరణ, పెన్షన్ ప్రయోజనాల మెరుగుదల, పెన్షనర్లందరికీ ఒకే విధమైన డీఏ అమలు చేయడం, ఎన్‌పీఎస్ పరిధిలోని ఉద్యోగులకు పాత పెన్షన్ పథకం (ఓపీఎస్)కు మారే అవకాశం కల్పించడం వంటి డిమాండ్లు కూడా ఇంకా పరిష్కారం కాలేదని సంఘాలు తెలిపాయి.

## ఆఖరి గంట కొనుగోళ్లు!

- మూడు రోజుల నష్టాలకు బ్రేక్
- 138 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్.. నిఫ్టీ 46 పాయింట్లు పైకి..
- హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లకు డిమాండ్
- 102 డాలర్లకు చేరిన బ్రెంట్



**ముంబై:** వరుసగా మూడు సెషన్ల నష్టాలకు బ్రేక్ పడింది. గురువారం ఆఖరి గంటలో ఆర్థిక రంగ షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్లతో దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ తదితర షేర్లకు డిమాండ్ పెరిగింది. అయితే బ్యారెల్ ముడిచమురు ధర 100 డాలర్లకు పైగా ఉండటం, భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్లు రోజంతా పరిమిత శ్రేణిలోనే కదిలాయి. 30 షేర్ల బీఎస్ఈ సెన్సెక్స్ 138.36 పాయింట్లు (0.19 శాతం) లాభపడి 74,902.59 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 74,910.96 గరిష్ఠాన్ని, 74,598.47 కనిష్ఠాన్ని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 46.30 పాయింట్లు (0.20 శాతం) పెరిగి 23,477.80 వద్ద ముగిసింది. పవర్‌గ్రిడ్, యాక్సిస్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎన్‌టీపీసీ, టెక్ మహీంద్రా, భారతి ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్‌అండ్‌టీలలో కొనుగోళ్లు కనిపించగా.. హెచ్‌సీఎల్ టెక్, టాటా స్టీల్, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి.

### చమురు ధరల సెగ

అంతర్జాతీయ చమురు బెంచ్‌మార్క్ బ్రెంట్ ధర 1.19 శాతం పెరిగి బ్యారెల్‌కు 102.20 డాలర్లకు చేరింది. అధిక ముడిచమురు ధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు మదుపరుల రిస్క్ తీసుకునే సామర్థ్యాన్ని పరిమితం చేశాయి. ఈ నేపథ్యంలో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.16 శాతం పెరగగా.. మిడ్‌క్యాప్ సెలెక్ట్ సూచీ 0.34 శాతం తగ్గింది. బీఎస్ఈ రంగాల సూచీల్లో ఇన్సూరెన్స్ 0.58 శాతం, టాప్–10 బ్యాంకులు 0.52 శాతం, బ్యాంకెక్స్ 0.36 శాతం, ప్రైవేట్ బ్యాంకులు 0.35 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 0.34 శాతం, పీఎస్‌యూ బ్యాంక్ సూచీ 0.32 శాతం చొప్పున లాభపడ్డాయి. క్యాపిటల్ గూడ్స్ 0.99 శాతం, టెలికమ్యూనికేషన్ 0.91 శాతం, మెటల్ 0.67 శాతం, హాస్పిటల్స్ 0.48 శాతం చొప్పున నష్టపోయాయి.

### అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై చూపు

త్వరలో వెలువడనున్న అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలపై మదుపరులు దృష్టి సారించారు. ఈ గణాంకాలు ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల విధానంపై అంచనాలను ప్రభావితం చేయడంతోపాటు ప్రపంచ ఈక్విటీలు, బాండ్ల రాబడులు, వర్ధమాన దేశాల కరెన్సీలకు దిశానిర్దేశం చేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్, హాంకాంగ్ హ్యాంగ్‌సెంగ్ నష్టాల్లో ముగియగా.. జపాన్ నిక్కీ లాభాల్లో స్థిరపడింది. యూరప్ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడయ్యాయి. బుధవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఎక్స్ఛేంజీల గణాంకాల ప్రకారం బుధవారం విదేశీ సంస్థాగత మదుపరులు రూ.582.99 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించారు. బుధవారం సెన్సెక్స్ 813.35 పాయింట్లు పతనమై 74,764.23 వద్ద, నిఫ్టీ 203.60 పాయింట్లు తగ్గి 23,431.50 వద్ద ముగిసిన విషయం తెలిసిందే.

## భారత్‌పై పెప్సికో భారీ ఆశలు

- త్వరలో ప్రపంచ టాప్–10 మార్కెట్లలో భారత్
- 2030 నాటికి రూ.5,700 కోట్ల పెట్టుబడులు
- అసోంలో ఐదో తయారీ ప్లాంట్ ప్రారంభం.. దక్షిణాదిలో విస్తరణ




**గువాహటి:** భారత్ మార్కెట్‌పై అంతర్జాతీయ ఆహార, పానీయాల దిగ్గజం పెప్సికో భారీ ఆశలు పెట్టుకుంది. రానున్న సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా తమ టాప్–10 మార్కెట్లలో భారత్ చేరుతుందని సంస్థ ఇండియా, దక్షిణాసియా సీఈఓ జగ్రుత్ కోటేచా తెలిపారు. 2030 నాటికి దేశంలో తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు సుమారు రూ.5,700 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. పెప్సికో గురువారం అసోంలోని నల్బరీలో రూ.778 కోట్ల పెట్టుబడితో 44.2 ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఐదో ఫుడ్ తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్ష, పరోక్షంగా 700 మందికి ఉపాధి లభించనుందని సంస్థ తెలిపింది. స్థానిక ఎంఎస్ఎంఈలు, అనుబంధ పరిశ్రమల అభివృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొంది.

### 5వేల మంది రైతులకు ప్రయోజనం

నల్బరీ ప్లాంట్ ద్వారా రానున్న సంవత్సరాల్లో 5వేల మందికి పైగా రైతుల నుంచి చిప్ తయారీకి అనువైన బంగాళాదుంపలను సేకరించనున్నట్లు పెప్సికో తెలిపింది. సుమారు 60 వేల టన్నుల కోల్డ్ స్టోరేజీ సామర్థ్యానికి డిమాండ్ ఏర్పడుతుందని పేర్కొంది. స్థిరమైన వ్యవసాయ పద్ధతులతో అసోం వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యమని వెల్లడించింది. ఉత్పత్తి సామర్థ్యం, సరఫరా వ్యవస్థను విస్తరించడంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో ఈ ఏడాది కన్సన్‌ట్రేట్ ప్లాంట్‌ను ప్రారంభించిన పెప్సికో.. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో మరో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. దేశీయ మార్కెట్ అవసరాలకే ప్రధానంగా ఈ సామర్థ్యాన్ని వినియోగించనున్నట్లు కోటేచా తెలిపారు. పొరుగు దేశాలైన భూటాన్, శ్రీలంకకు కొంతమేర ఎగుమతులు కొనసాగుతాయని చెప్పారు.
తక్కువ తలసరి వినియోగమే అవకాశంగా..
ప్యాకేజ్డ్ ఉత్పత్తుల విషయంలో ఇతర మార్కెట్లతో పోలిస్తే భారత్‌లో తలసరి వినియోగం ఇంకా చాలా తక్కువగా ఉందని కోటేచా అన్నారు. ఆహారం, పానీయాల రెండు విభాగాల్లోనూ భారత్‌కు అపారమైన అవకాశాలున్నాయని, అందుకే దేశ మార్కెట్‌పై తాము ఎంతో ఆశావహంగా ఉన్నామని చెప్పారు. ప్రాంతీయ రుచులు, అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను రూపొందిస్తూ 'భారత్‌లో తయారీ.. భారతీయుల కోసం' విధానంతో ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. 2025లో పెప్సికో ఇండియా టర్నోవర్ రూ.9,789 కోట్లుగా నమోదైంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంస్థకు భారత్ టాప్–13 కీలక మార్కెట్లలో ఒకటిగా ఉంది.

## కెనరా బ్యాంక్ రూ.8,500 కోట్ల సమీకరణ

- రూ.4,500 కోట్ల ఏటీ–1 బాండ్ల జారీకి బోర్డు అనుమతి
- టైర్–2 బాండ్ల ద్వారా మరో రూ.4,000 కోట్లు
- రూ.30 లక్షల కోట్ల వ్యాపార లక్ష్యంగా ముందుకు
- ఎఫ్‌సీఎన్ఆర్(బీ) స్వాప్‌తో 5.80 బిలియన్ డాలర్ల సమీకరణ

**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ వ్యాపార విస్తరణకు అవసరమైన నిధుల సమీకరణకు సిద్ధమైంది. బాసెల్–3 నిబంధనలకు అనుగుణంగా రూ.4,500 కోట్ల వరకు అదనపు టైర్–1 (ఏటీ–1) బాండ్లను జారీ చేయాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు బ్యాంక్ బోర్డు అనుమతించినట్లు గురువారం వెల్లడించింది. ఏటీ–1 బాండ్ల ద్వారా రూ.4,500 కోట్లు, టైర్–2 బాండ్ల ద్వారా మరో రూ.4,000 కోట్లు.. మొత్తంగా రూ.8,500 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ప్రతిపాదిత ఏటీ–1 బాండ్లు శాశ్వత రుణ సాధనాలుగా ఉంటాయి. నియంత్రణ సంస్థల అనుమతికి లోబడి జారీ చేసిన ఐదేళ్ల తర్వాత వాటిని తిరిగి కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. వీటిపై 7.85–7.90 శాతం వరకు కూపన్ రేటు ఉండొచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

### రూ.30 లక్షల కోట్ల వ్యాపారంపై గురి

ప్రధాన వ్యాపార విభాగాల్లో స్థిరమైన వృద్ధితో కెనరా బ్యాంక్ ముందుకు సాగుతోందని సంస్థ తెలిపింది. రిటైల్, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, కార్పొరేట్ విభాగాల్లో డిపాజిట్లు, రుణాలు పెరుగుతున్నాయని పేర్కొంది. ఈ క్రమంలో బ్యాంక్ మొత్తం వ్యాపార పరిమాణాన్ని రూ.30 లక్షల కోట్లకు చేర్చే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. ఆర్‌బీఐ ఇటీవల ప్రకటించిన ఎఫ్‌సీఎన్ఆర్(బీ) స్వాప్ సదుపాయాన్ని వినియోగించుకుని కెనరా బ్యాంక్ 5.80 బిలియన్ డాలర్లను సమీకరించినట్లు తెలిపింది. దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో బ్యాంక్‌కు ఉన్న విస్తృత కార్యకలాపాలు, ఖాతాదారుల విశ్వాసానికి ఈ సమీకరణ నిదర్శనమని పేర్కొంది.



# మాళవికను ఫిదా చేసిన డైరెక్టర్!

కోలీవుడ్‌లో విభిన్నమైన కథలు, విలక్షణమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'పాకెట్ నావల్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. విజయ్ సేతుపతి, మాళవిక మోహనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది. టైలర్ డర్డెన్ అండ్ కినో ఫిస్ట్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని శరవేగంగా నిర్మిస్తున్నారు. కాగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న మాళవిక మోహనన్.. ఈ సినిమా, దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజాతో తన అనుభవాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'పాకెట్ నావల్' ప్రాజెక్ట్ కోసం త్యాగరాజన్ కుమారరాజాను తొలిసారి స్క్రిప్ట్ రీడింగ్ సెషన్‌లో కలిసినప్పుడే.. ఆయన మిగతా దర్శకులందరికంటే ఎంత భిన్నమైన వ్యక్తో తనకు అర్థమైందని మాళవిక చెప్పారు. ఆయన పనితీరులోని ప్రత్యేకత తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. సాధారణంగా దర్శకులు ఒక నటుడి నుంచి తమకు కావాల్సిన పాత్రను రాబట్టేందుకు ప్రయత్నిస్తుంటారని.. కానీ త్యాగరాజన్ కుమారరాజా మాత్రం నటీనటులను ఒకే తరహా పాత్రలో ఇరికించేందుకు ప్రయత్నించరని మాళవిక ప్రశంసించారు. ప్రతి నటుడి వ్యక్తిత్వాన్ని, ఆలోచనా విధానాన్ని నిశితంగా పరిశీలించి.. దానికి తగ్గట్టుగా పాత్రను మలిచే విధానం ఆయనలో ఉందని చెప్పారు. ముఖ్యంగా నటీనటులను కేవలం ఆర్టిస్టులుగా కాకుండా వ్యక్తులుగా అర్థం చేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తారని మాళవిక వెల్లడించారు. పైకి కనిపించే విషయాలకే పరిమితం కాకుండా.. మనం ఎలా ఆలోచిస్తాం? మన స్వభావం ఎలా ఉంటుంది? మనలోని భావాలు ఎలా పనిచేస్తాయి? అనే విషయాలను కూడా ఆయన గమనిస్తారని తెలిపారు. ఇండస్ట్రీలో ఇలాంటి ప్రత్యేకమైన వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారని ఆమె అభిప్రాయపడ్డారు. త్యాగరాజన్ కుమారరాజా ఆలోచనా విధానం తనకు ఎంతో ఆసక్తికరంగా అనిపించిందని, ఆయన దృక్పథం చాలా అందంగా ఉంటుందని మాళవిక అన్నారు. ఒక దర్శకుడిగా మాత్రమే కాకుండా అద్భుతమైన క్రియేటర్‌గా ఆయనను అభివర్ణించారు. తన పని పట్ల ఆయనకు ఎంతో అంకితభావం ఉందని, ప్రతి సన్నివేశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ఎంతో శ్రద్ధ తీసుకుంటారని ప్రశంసించారు. ఆయనతో కలిసి పనిచేయడం తనకు మంచి అనుభవంగా మిగిలిందని మాళవిక చెప్పుకొచ్చారు. విజయ్ సేతుపతి, మాళవిక మోహనన్ వంటి ప్రతిభావంతులైన నటులతో త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న 'పాకెట్ నావల్' ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ప్రస్తుతం దర్శకుడిపై మాళవిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ సినిమాపై మరింత హైప్ పెరుగుతోంది.

# అక్షయ్.. మౌజా మొదలైంది!



బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్, ప్రముఖ దర్శకుడు అనీష్ బజ్మీ కాంబినేషన్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. 'వెల్‌కమ్', 'సింగ్ ఈజ్ కింగ్', 'థ్యాంక్ యూ' చిత్రాల తర్వాత వీరిద్దరి కాంబో నాలుగోసారి రిపీట్ అవుతోంది. దాదాపు 16 ఏళ్ల విరామం తర్వాత కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రాశి ఖన్నా, విద్యాబాలన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగు తోంది. కాగా, అక్షయ్ కుమార్ పుట్టిన రోజు సం ద ర్భం గా తన కొత్త సినిమా టైటిల్‌ను స్వయం గా వెల్ల డిం చి అభి మా ను లకు సర్ ప్రైజ్ ఇచ్చారు. తనకు శుభాకాంక్షలు తెలిపిన కోస్టార్స్, దర్శకులకు సోషల్ మీడియా వేదికగా స్పందించిన అక్షయ్.. అనీష్ బజ్మీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రానికి 'మౌజా హి మౌజా' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలిపారు. విద్యాబాలన్, రాశి ఖన్నాలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు చెబుతూ వారితో కలిసి దిగిన ఫొటోను కూడా పంచుకున్నారు. ఇదిలా ఉండగా.. అక్షయ్ నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'హైవాన్' సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాతో అక్షయ్ తొలిసారిగా పూర్తిస్థాయి విలన్‌గా కనిపించనుండటం విశేషం.

# పెళ్లి చేసుకోకపోతే తప్పేంటి?



కన్నడ, తమిళ సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి రమ్య కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. 43 ఏళ్ల వయసులోనూ పెళ్లి చేసుకోకపోవడంపై తరచూ ఎదురవుతున్న ప్రశ్నలకు తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో ఆమె ఘాటుగా స్పందించారు. పెళ్లి చేసుకోవడం జీవితంలో అంత ముఖ్యమా? అని ప్రశ్నించిన రమ్య.. వివాహం తన వ్యక్తిత్వాన్ని ఎప్పటికీ నిర్వచించదని స్పష్టం చేశారు. పెళ్లి చేసుకోకపోయినా ఆనందంగా జీవించవచ్చని, జీవితంలో సంతోషంగా ఉండటమే ముఖ్యమని అన్నారు. సమాజం నుంచి ఒత్తిడి వచ్చినా.. మనకు ఏది కావాలో మనమే నిర్ణయించుకోవాలని సూచించారు. అయితే తాను పెళ్లికి వ్యతిరేకం కాదని చెప్పిన రమ్య.. ఇద్దరి మధ్య మంచి స్నేహం, ఒకే రకమైన విలువలు, పరస్పర అవగాహన ఉంటే వివాహ బంధం ఎంతో అందంగా ఉంటుందని తెలిపారు. కేవలం సామాజిక ఒత్తిడి కారణంగా మాత్రం పెళ్లి చేసుకోవద్దని స్పష్టం చేశారు. తన జీవితంలో అలాంటి సరైన వ్యక్తి ఇంకా దొరకలేదని, ప్రస్తుతం పెళ్లి కోసం ఎలాంటి ప్రయత్నం కూడా చేయడం లేదని.. పూర్తిగా పనితో బిజీగా ఉన్నానని రమ్య చెప్పుకొచ్చారు. ఆమె వ్యాఖ్యలపై కొందరు విమర్శలు చేస్తుండగా.. మరికొందరు మాత్రం రమ్య చెప్పింది వాస్తవమేనంటూ మద్దతు పలుకుతున్నారు.

# రౌద్రం చూపించిన రణబాలి

రౌడీ హీరో విజయ్ దేవరకొండ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'రణబాలి' టీజర్ వచ్చేసింది. బ్రిటిష్ పాలనలో ప్రాణాలు కోల్పోయిన 80 లక్షల మంది భారతీయుల జ్ఞాపకార్థం 1876–78 అనే పవర్‌ఫుల్ క్యాప్షన్‌తో విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. "ఇది అన్నపూర్ణ దేశం రా.. అన్నానికి కరువే ఉంది. వీళ్లంతా మన భూమిని మింగడానికి ఏడు సముద్రాలు దాటి వచ్చిన కరువు రాక్షసులు" అనే ఎమోషనల్ డైలాగ్‌తో టీజర్ ప్రారంభమవుతుంది. గుప్పెడు మెతుకుల కోసం అల్లాడుతున్న ప్రజలు, ఆకలితో ప్రాణాలు కోల్పోతున్న దీనుల దృశ్యాలు కథలోని ఎమోషనల్ డెప్త్‌ను చూపిస్తున్నాయి. ఇక టీజర్ చివర్లో విజయ్ దేవరకొండ ఎంట్రీ అదిరిపోయింది. "సింగనమల బొబ్బిలి రణబాలిరా నీ అక్కా..!!" అంటూ ఆయన చెప్పే పవర్‌ఫుల్ డైలాగ్, ఎలివేషన్ సీన్లు గూస్‌బంప్స్ తెప్పిస్తున్నాయి. దీంతో ఈ టీజర్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి 'ట్యాక్సీవాలా' ఫేమ్ రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# టాక్సిక్ పై యశ్ రియాక్షన్!

రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటించిన 'టాక్సిక్' చిత్రంపై విడుదలకు ముందు భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆగస్టు 26న కన్నడతో పాటు తెలుగు, తమిళ, హిందీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మిశ్రమ స్పందన లభించింది. ముఖ్యంగా కథ, స్క్రీన్‌ప్లే, నిడివిపై కొంతమంది ప్రేక్షకులు, విమర్శకులు అసంతృప్తి వ్యక్తం చేయగా.. బాక్సాఫీస్ వసూళ్లపైనా అంచనాలకు తగ్గ ఫలితం రాలేదనే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో 'టాక్సిక్' ఫలితంపై యశ్ ఎలా స్పందించారన్న విషయాన్ని ఆయన సన్నిహిత మిత్రుడు, నటుడు, డబ్బింగ్ ఇన్‌ఛార్జ్ జైదేవ్ మోహన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. "ఫలితం గురించి మరీ ఎక్కువగా బాధపడకండి. ఇక దీనిని ప్రేక్షకులకే వదిలేద్దాం. మేము ఎంతో చిత్తశుద్ధితో ఈ చిత్రాన్ని రూపొందించి ప్రజలకు అందించాం. ఇప్పుడు అది వాళ్ల చేతుల్లోనే ఉంది. ఫలితం ఎలా వచ్చిందనే దాని గురించి అతిగా ఆలోచించడం మానేద్దాం. ఇంకా చాలా పనులు ఉన్నాయి.. తదుపరి చిత్రం కోసం సిద్ధం అవ్వండి" అని యశ్ తనతో చెప్పినట్లు జైదేవ్ తెలిపారు. అయితే ఈ మాటలు చెబుతున్న సమయంలో యశ్ గొంతులో బాధ స్పష్టంగా కనిపించిందని ఆయన పేర్కొన్నట్లు తాజా కథనాలు చెబుతున్నాయి. దీంతో 'టాక్సిక్' ఫలితంపై యశ్ స్పందనకు సంబంధించిన వార్తలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

# సూర్య సీన్ మొదలైంది



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చాడు. జీతూ మాధవన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సూర్య 47' చిత్రానికి 'సీన్' అనే టైటిల్‌ను ఖరారు చేస్తూ పవర్‌ఫుల్ టీజర్, పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. గత కొంతకాలంగా ఈ సినిమాకు 'సీన్' అనే టైటిల్ ఖరారవుతుందనే ప్రచారం సాగుతుండగా.. తాజాగా అదే టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. టీజర్‌లో షార్ట్, టీషర్ట్‌లో సరికొత్త మేకోవర్‌లో కనిపించిన సూర్య.. స్టైలిష్ ఎంట్రీతో అదరగొట్టాడు. పోలీస్ ఆఫీసర్ భుజంపై చేయి వేసి జైలు ఖైదీల మధ్య నుంచి సూర్య నడుచుకుంటూ వచ్చే సీన్ అభిమానులకు గూస్‌బంప్స్ తెప్పిస్తోంది. ఈ టీజర్‌తో 'సీన్'లో సూర్యను సరికొత్త యాంగిల్‌లో చూపించబోతున్నట్లు మేకర్స్ హింట్ ఇచ్చారు. 'ఆవేశం'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న జీతూ మాధవన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నజ్రియా నజీమ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. 'ప్రేమలు' ఫేమ్ నస్లెన్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. సుశిన్ శ్యామ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని దీపావళి కానుకగా నవంబర్ 6, 2026న థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# బిగ్‌బాస్‌లో డేంజర్ గేమ్!



బిగ్‌బాస్ కొత్త సీజన్ మొదలైన కొద్దిరోజుల్లోనే హౌస్‌లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఓ వైపు తెలుగు బిగ్‌బాస్‌లో 'మహాపరీక్ష' టాస్క్ రసవత్తరంగా సాగుతుండగా.. మరోవైపు తమిళ బిగ్‌బాస్‌లో కంటెస్టెంట్ గోడ దూకి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు వైరల్ అవుతున్న వీడియో కలకలం రేపుతోంది. తెలుగు బిగ్‌బాస్‌లో హౌస్‌మేట్స్ బ్లూ, రెడ్ టీమ్‌లుగా విడిపోయి టాస్క్‌లో పోటీపడుతున్నారు. ఈ క్రమంలో ప్రతి టీమ్ నుంచి ఒక్కరిని హైరిస్క్ జోన్‌లో పెట్టాలని బిగ్‌బాస్ ఆదేశించాడు. బ్లూ టీమ్ తరఫున లీడర్ రాంప్రసాద్ స్వయంగా హైరిస్క్‌లోకి వెళ్లేందుకు ముందుకు రాగా.. రెడ్ టీమ్ నుంచి ఆర్జే చరణ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. దీంతో రాంప్రసాద్, చరణ్ ఈ వారంలో ఎప్పుడైనా ఎలిమినేట్ అయ్యే ప్రమాదంలో ఉన్నారు. అయితే వారి వద్ద ఉన్న ప్రత్యేక కీస్‌ను సరిగ్గా ఉపయోగిస్తే ఎలిమినేషన్ నుంచి తప్పించుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇక తమిళ బిగ్‌బాస్ పదో సీజన్‌లో మరో సంచలనం చోటుచేసుకుంది. సెప్టెంబర్ 6న 19 మంది కంటెస్టెంట్లతో ప్రారంభమైన ఈ షోలో 'కుక్ విత్ కోమాలి' ఫేమ్ అన్సర్ కూడా పాల్గొంటున్నాడు. అయితే షో ప్రారంభమైన రెండో రోజే అన్సర్ ఏకంగా 20 అడుగుల గోడపైకి ఎక్కి హౌస్ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు వైరల్ వీడియో చర్చనీయాంశంగా మారింది. తోటి కంటెస్టెంట్ జేసన్‌తో జరిగిన వాగ్వాదం, కెప్టెన్సీ చర్చల సమయంలో చోటుచేసుకున్న ఘర్షణలే ఇందుకు కారణమనే ప్రచారం జరుగుతోంది. గతంలో తమిళ బిగ్‌బాస్ తొలి సీజన్‌లో నటుడు భరణి కూడా ఇదే తరహాలో గోడ ఎక్కేందుకు ప్రయత్నించడంతో.. ఇప్పుడు అన్సర్ ఘటనతో ఆ సంఘటనను నెటిజన్లు గుర్తుచేసుకుంటు న్నారు. మొత్తంగా బిగ్‌బాస్ హౌస్‌ల్లో ఆట కంటే ట్విస్టులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఒకవైపు ఎలిమినేషన్ టెన్షన్.. మరోవైపు కంటెస్టెంట్ల మధ్య గొడవలు, ఎస్కేప్ ప్రయత్నాలు.. ఇలా రోజుకో కొత్త మలుపుతో బిగ్‌బాస్ సందడి మరింత రసవత్తరంగా మారుతోంది.

# అక్టోబర్ 23న 'హైకూ'

'కోర్టు', 'బ్యాండ్ మేళం' చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ నటి శ్రీదేవి అపల్ల ఇప్పుడు తమిళ చిత్రసీమలోకి అడుగుపెడుతోంది. ఆమె తొలి తమిళ చిత్రం 'హైకూ'. ఏగన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో శ్రీదేవి అపల్ల, 'మిన్నల్ మురళి' ఫేమ్ ఫెమినా జార్జ్ కథానాయికలుగా నటిస్తున్నారు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. "అంతా ప్రేమ గురించే.. 'హైకూ' అద్భుతమైన ప్రపంచాన్ని అక్టోబర్ 23న ప్రపంచవ్యాప్తంగా మీ ముందుకు తీసుకొస్తున్నాం" అంటూ వెల్లడించారు. దీనికి సంబంధించిన చిన్న రిలీజ్ డేట్ గ్లింప్స్‌ను కూడా విడుదల చేయగా.. అందులోని క్యూట్ లవ్ ట్రాక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఫీల్‌గుడ్




రొమాంటిక్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి యువరాజ్ చిన్నసామి దర్శకత్వం వహిస్తున్నారు. తెలుగు తర్వాత తమిళ ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమవుతున్న శ్రీదేవి అపల్లకు 'హైకూ' ఎలాంటి గుర్తింపు తీసుకొస్తుందో చూడాలి.

# కొత్త అధ్యాయానికి సమంత రెడీ!



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాలకు కాస్త విరామం ఇచ్చి జీవితంలో కొత్త అధ్యాయాన్ని ఆస్వాదిస్తున్నారు. ఇటీవల 'మా ఇంటి బంగారం' సినిమాతో ప్రేక్షకులను అలరించిన ఆమె.. ప్రస్తుతం మాతృత్వపు మధురానుభూతులను ఆస్వాదించేందుకు పూర్తిగా సిద్ధమవుతున్నారు. గర్భవతిగా ఉన్న సమంత కొంతకాలం పాటు సినిమాలకు దూరంగా ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ.. సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. తన బేబీ బంప్ ఫొటోలతో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకుంటూ వారికి మరింత దగ్గరవుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'ది హాలీవుడ్ రిపోర్టర్ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై సమంత మెరిశారు. దీంతో ఆమె లుక్‌తో పాటు ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సందర్భంగా తన జీవితంలో చోటుచేసుకోబోతున్న మార్పులు, మాతృత్వం తీసుకురాబోయే కొత్త అనుభూతులు, బాధ్యతల గురించి సమంత మనసు విప్పి మాట్లాడారు. త్వరలో తన జీవితంలోకి అడుగుపెట్టబోతున్న బేబీ కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నానని ఆమె తెలిపారు. తల్లి కావడం తన జీవితంలో ఎంతో ప్రత్యేకమైన అనుభూతి అని పేర్కొంటూ.. ఈ కొత్త బాధ్యతను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాననే భావాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యంగా తన రాబోయే బేబీ బంగారం కోసం ఎదురుచూస్తున్నానని చెప్పడం అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ.. తన వ్యక్తిగత జీవితంలోని ఈ అందమైన క్షణాలను అభిమానులతో పంచుకుంటూ సమంత నిత్యం వార్తల్లో నిలుస్తున్నారు.

# నానితో 'డాన్' డైరెక్టర్




నేచురల్ స్టార్ నాని ప్రస్తుతం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్'తో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా సెప్టెంబర్ 24న విడుదలకు సిద్ధమవుతోంది. కాగా, నాని తదుపరి చిత్రంపై ఆసక్తికరమైన వార్త వినిపిస్తోంది. 'డాన్'తో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న సిబి చక్రవర్తితో నాని జతకట్టబోతున్నట్లు టాక్. వీరిద్దరి మధ్య కథా చర్చలు జరిగినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్ట్ అభివృద్ధి దశలో ఉండగా.. త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని ఫిల్మ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఈ కాంబినేషన్‌పై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.